Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 24.03.2017, శుక్రవారం
సంపుటి : 36 సంచిక : 42
పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

## ఈ ఫలితాలు...

# బాబుకు ప్రమాద సంకేతాలు!



అధికారాన్ని ఫణంగా పెట్టి, విలువలను పాతిపెట్టి, డబ్బు సంచులు తెచ్చిపెట్టి, మాట వినని వారిపై కేసులు పెట్టి, ఓటర్ల తరలింపుకు ప్రత్యేక విమానాలే పెట్టి, రిసార్ట్స్‌లో క్యాంపులు పెట్టి, అక్రమ కేసులు, అట్రాసిటీ కేసులతో అవతల వారిని భయపెట్టి... గెలిచిన గెలుపు అదీ ఓ గెలుపేనా?

(మిగతా 11వ పేజీలో)

- చచ్చీ చెడి స్థానిక ఎమ్మెల్సీలలో గెలుపు
- ఉద్యోగులు, నిరుద్యోగుల తీర్పులో చావుదెబ్బ
- యువతలో వున్న వ్యతిరేకతకు ప్రతిరూపంగా ఫలితాలు
- పసుపు దండుకు స్థానిక ఎమ్మెల్సీ విజయానందం 24గంటలే!
- స్థానిక ఎమ్మెల్సీల్లో గెలిచినా... విలువల్లో ఓడిన బాబు

## పట్టాభి ఓడాడు...

# పట్టభద్రుడు గెలిచాడు!






- గురుశిష్యులకు శృంగభంగం
- నారాయణ అహంకారధోరణికి తగిన శాస్తి జరిగిందని సంతోషిస్తున్న తెలుగుతమ్ముళ్ళు
- పట్టాభి పరాజయం కోసం పూజలు చేసిన జనం
- ఓటమి బాధ్యత నుండి తప్పించుకునేందుకు కుంటిసాకులు వెతుకుతున్న నారాయణ

విజ్ఞానం గెలిచింది... విశ్వసనీయత నిలిచింది. వినయాన్నే విజయం వరించింది. అక్రమార్కులను మేధావులు తమ ఓటుహక్కుతో తుక్కు తుక్కు చేసారు. పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఎన్నికయ్యే వ్యక్తులకు ఒక వ్యక్తిత్వం, విలువలు కనీస అర్హతగా ఉండాలని, చెంచాగాళ్ళకు ఇక్కడ స్థానం లేదని పట్టభద్రులు బల్లగుద్ది చెప్పారు. శాసనమండలిలో అడుగుపెట్టడానికి కాదుకదా ఆ భవనం వైపు చూడడానికి కూడా అర్హత లేని వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డికి అతని స్థానం ఎక్కడో, ఆయన స్థాయి ఏమిటో తెలియపరిచారు. ప్రజల సమస్యలను తమ బాధ్యతగా భావించి పనిచేసే పెద్దమనిషి, పట్టభద్రుడు యండపల్లి శ్రీనివాసులురెడ్డిని ఎమ్మెల్సీగా ఎన్నుకోవడం ద్వారా శాసనమండలికి వున్న

(మిగతా 11వ పేజీలో)









# మళ్ళీ ఆ ముగ్గురే!

- స్థానిక ఎమ్మెల్సీలో గట్టెక్కిన వాకాటి
- హ్యాట్రిక్ కొట్టిన విఠపు బాలసుబ్రహ్మణ్యం
- అక్రమాలకు ఎదురొడ్డి గెలిచిన యండపల్లి

నెల్లూరుజిల్లా స్థానిక సంస్థల శాసనమండలి నియోజకవర్గానికి జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసిన వాకాటి నారాయణరెడ్డి 87 ఓట్ల తేడాతో తన ప్రత్యర్థి వైకాపా అభ్యర్థి ఆనం విజయకుమార్‌రెడ్డిపై గెలిచాడు. 2012లోనూ ఆయన నెల్లూరు స్థానిక ఎమ్మెల్సీ నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా 9ఓట్ల తేడాతో గెలవడం జరిగింది. వరుసగా ఆయనకు స్థానిక ఎమ్మెల్సీగా ఇది రెండో విజయం. అలాగే తూర్పు రాయలసీమ(చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం) ఉపాధ్యాయుల శాసనమండలి నియోజకవర్గం నుండి వైకాపా బలపరచిన పిడిఎఫ్ అభ్యర్థి విఠపు బాలసుబ్రహ్మణ్యం 3,553 ఓట్ల తేడాతో తెలుగుదేశం అభ్యర్థి వాసుదేవనాయుడుపై విజయం సాధించారు. అలాగే అత్యంత ఉత్కంఠ భరితంగా జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో

(మిగతా 11వ పేజీలో)

# అన్నదాతను ముంచిన అకాలవర్షం



**• చేతికందివచ్చిన పంట నీటిపాలు • వడగండ్ల కడగండ్లతో రైతన్నల విలవిల**

వాన రాకడ.. ప్రాణం పోకడ తెలియదని సామెత. పంటలు బాగా పండాలని, అదునుకు వాన కురవాలని పదునైన ఎదురుచూసినప్పుడు మాత్రం రాని వాన, తీరా పంటలు చేతికి అందివచ్చే సమయంలో మాత్రం ఒక్కసారిగా కుండపోతగా కురుస్తుంది. ఎదిగిన పంటలను నీటముంచి వికటాట్టహాసం చేస్తుంది. ఈ ప్రకృతి ప్రకోపానికి అన్నదాతలు విలవిలలాడిపోతున్నారు. అసలే మెట్టప్రాంత రైతులు..కొద్దోగొప్పో నీటితో అష్టకష్టాలు పడి పంటలు పండించుకుంటే ఆ పంటంతా హరీమంది. మూలిగే నక్కపై తాటి పండు పడిన చందంగా, అసలే కరువు వాతపడి రైతులు దీనావస్థలో వున్న సమయంలో వడగండ్లు పడి మరింత కడగండ్లు తెచ్చాయి. మండే ఎండల్లో కురిసిన ఈ అకాలవర్షాలు రైతులను మళ్ళీ అప్పుల సుడిగుండంలోకి నెట్టేశాయి. కష్టాల్లో వున్న తమను ఆదుకుని తగు చేయూత నందించాలని రైతన్నల కుటుంబాలు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాయి. ఇటీవల ఉదయగిరి నియోజకవర్గంలోని వింజమూరు, వరికుంటపాడు, కొండాపురం మండలాల్లో కురిసిన అకాల వర్షాలతో రైతన్నలు మళ్ళీ అష్టకష్టాల పాలయ్యారు. పలుచోట్ల వడగండ్ల వాన కూడా కురవడంతో వందలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఆ ప్రాంతరైతులు కోట్లరూపాయల్లో నష్టాల పాలయ్యారు. అసలే వర్షాభావంతో కరువు దెబ్బకు ఇక్కడ పంటలు వేసిందే తక్కువ. అయినా వరుణుడి ఆగ్రహానికి పంటలన్నీ నీటిపాలైనాయి. రైతులకు కన్నీటినే మిగిల్చాయి. సుమారు 400ఎకరాల్లో వరి నీట మునిగిపోయింది. మరో 250ఎకరాల్లో బత్తాయి, వంద ఎకరాల్లో అరటి, బొప్పాయి తోటలతో పాటు, మొక్కజొన్న, మిరప తదితర పంటలన్నీ మునిగిపోయాయి. అటు వరి రైతులు, ఇటు తోటల రైతాంగం ఈ అకాలవర్షానికి అతలాకుతలమైపోయారు. అప్పోసప్పో చేసి ఎంతో కష్టపడి సాగు చేసుకున్న పంటలు నీట మునగడంతో మళ్ళీ తిరిగి కోలుకోలేనంతగా అప్పుల పాలయ్యారు. వరికుంటపాడు మండలంలోని గణేశ్వరపురం, నారసింహాపురం, తూర్పు రొంపిదొడ్ల గ్రామాల్లోనైతే ఏకంగా వడగండ్ల వానే పడింది. ఈదురుగాలులు, వడగండ్లు కలసి పంటలన్నిటినీ భీభత్సం చేశాయి. వింజమూరు మండలంలోని వింజమూరు, చాకలకొండ, బత్తినవారిపల్లి, జనార్ధనపురం, గోళ్ళవారిపల్లి, ఊటుకూరు, కాటేపల్లి, తమిదపాడు తదితర ప్రాంతాల్లోనూ, కొండాపురం మండలంలోని గరిమెనపెంట, చల్లవారిపల్లి తదితర ప్రాంతాల్లోనూ వరితో పాటు బత్తాయి, బొప్పాయి తోటలు, తమలపాకు తోటలు, అరటితోటలతో పాటు మిరప, మొక్కజొన్న పంటలు అన్నీ వర్షార్పితమయ్యాయి. ఇక ఆ రైతన్నలకు దేవుడే దిక్కు అన్నట్లుగా అయింది పరిస్థితి. జిల్లా కలెక్టర్ తదితర ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, దెబ్బతిన్న ప్రాంతాలను స్వయంగా పరిశీలించి, నష్టం వివరాలను తక్షణం అంచనా వేయించి, నష్టపోయిన రైతన్నలను ఆదుకోవాల్సి వుంది.

## హేవళంబి...
## నీకు నా శాల్యూట్

**- చిన్ని నారాయణరావు**

డీమానెటైజేషన్
చీకట్ల ఇక్కట్లతో
డీలాపడ్డ సామాన్య మానవుడిలో
కొత్త ఆశలు నింపేలా
సరికొత్త వెలుగులు పంచేలా
హేవళంబి రావమ్మారా
ఉద్దండరాయుని పాలెంలో
కొలువుతీరిన
శాసనసభ సాక్షిగా
తెలుగువారి అపురూప
రాజధాని అమరావతిగా
రూపుదిద్దుకొన్న వైభవంలో
వడివడిగా అడుగులు వేస్తూ
రామ్మా...
సామాన్యుల నోట్ల కష్టాలు
తీర్చే ఉగాదివి నీవేకదమ్మా
'సరిఫేస్'తో మాత్రం
నీ ఫేస్ చూపించకమ్మా
దయగల మాతగా రామ్మా
దండనవై ఖండనవై
అరివీర భయంకరివై
అవతరించకమ్మా
వ్యాపార నాశనివై
అనుగ్రహ వినాశినివై
సృష్టించే భయానకం మాకొద్దమ్మా
రైతన్న కన్నుల్లో ఉషస్సులు
బిజినెస్ మెన్లకు ఉషోదయాలు
సృష్టించే నవనవోన్మేష
ఉగాదివై రామ్మా
కార్పొరేట్‌ను ఆదుకొనే
కబోదిగా మాత్రం విచ్చేయకమ్మా
సామాన్యుడిపై ప్రేమజూపే
నవోదయం నీవేకావాలమ్మా
బ్యాంకులు మనుషుల పాలిట
జైలు బ్యారెక్‌లు అవుతున్న వేళ
ముట్టుకుంటూనే మరణశాసనం
లిఖించే మృత్యుహేలకు
సమాధానమిస్తూ రామ్మా
సంయమనం ప్రకటిస్తూ రామ్మా
కొత్తనోట్ల కరకు జలీలలో
వస్తున్నావే
శిఖరాగ్ర ఉగాదివై రామ్మా
సంక్షుభిత హృదయాల్ని
ఓదారుస్తూ...!
డిజిటల్ పాదాల వ్రాతలో
కొంగొత్త అడుగులు వేస్తూ
సరికొత్త భారతావనిని ఆవిష్కరిస్తూ
విచ్చేయమ్మా... హేవళంబి
నీకిదే నా శాల్యూట్!

## రక్తతిలకం 21వ వార్షికోత్సవం



నెల్లూరు టౌన్‌హాలు వర్ధమాన సమాజంలో ఈ నెల 18వ తేదీ రక్తతిలకం పక్షపత్రిక 21వ వార్షికోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆ పక్షపత్రిక సంచికను నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్, నగర డిప్యూటీమేయర్ ముక్కాల ద్వారకనాథ్, కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాసయాదవ్, ఏపియుడబ్ల్యూజె రాష్ట్ర కార్యదర్శి ఎ.జయప్రకాష్, పత్రికా సంపాదకులు ఎస్.రామారావులు ఆవిష్కరించారు. తొలుత అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు చీరలు పంపిణీ చేశారు. సీనియర్ జర్నలిస్టు షేక్ గౌస్‌బాషాను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు.

## ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవ ర్యాలీ



ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం భారతీయ దంతవైద్య సంఘం నెల్లూరు శాఖ, నారాయణ దంత వైద్యశాల సౌజన్యంతో ప్రజా అవగాహన ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీ నెల్లూరు విఆర్‌సి సెంటర్ నుండి నర్తకి సెంటర్ వరకు సాగింది. దాదాపు 150మందికిపైగా దంత వైద్యులు పాల్గొన్నారు. ఈ ర్యాలీ ముఖ్య ఉద్దేశ్యం ప్రజలకు నోటి ఆరోగ్యం పట్ల అవగాహన పెంచడం, దంత చికిత్స మీద ఆసక్తి కలిగించడం అని దంతవైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమం భారతీయ దంతవైద్య సంఘం అధ్యక్షుడు డా॥ నారాయణరెడ్డి, డా॥ ఎన్.కన్నన్, డా॥ శాఖమూరి శ్రీనివాసులు, డా॥ ఎ.రాజశేఖర్ ఆధ్వర్యంలో జరిగింది.

## నూరుశాతం ఇంటిపన్నుల వసూలు

**- మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజినల్ డైరెక్టర్ అనూరాధారెడ్డి**

రెవెన్యూ వసూళ్ళలో రాష్ట్రంలోనే నెల్లూరు నగరపాలక సంస్థ చివరి స్థానంలో ఉందని... మీరు ఏ మాత్రం పనిచేస్తున్నారో అర్థమవుతోందని, నెలాఖరుకు నూరుశాతం పన్నులు వసూలు కాకపోతే సంబంధిత అధికారులకు సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేయాల్సి వుంటుందని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజినల్ డైరెక్టర్ అనూరాధారెడ్డి రెవెన్యూ అధికారులపై తీవ్రంగా మండిపడ్డారు. నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం మూడుగంటల పాటు రెవెన్యూ అధికారులు సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో పేరుపేరునా ఆయా డివిజన్లలో వారి పన్నుల వసూళ్ళపై ఆరా తీసారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇళ్ళలో కూర్చుంటే పన్నులు వసూలు కావని, ఉన్నతాధికారి నుంచి బిల్‌కలెక్టర్ వరకు పన్నుల వసూళ్ళపై దృష్టి సారించాలని ఆదేశించారు. రోజుకు రూ.2.5కోట్లు పన్నులు వసూలు చేసి రిపోర్టును పంపాలని సూచించారు. దీర్ఘకాలిక పన్ను బకాయిలు వుంటే వారికి వారెంట్లు జారీ చేయాలని, అవసరమైతే ఆస్తులను జప్తు చేయాలని ఆదేశించారు. పదిరోజుల్లో పన్నుల వసూళ్ళు తగ్గితే వారి జీతాలనుంచి రికవరీ చేస్తానని హెచ్చరించారు. ప్రభుత్వ సంస్థల నుంచి రూ.12కోట్లు మేర పేరుకుపోవడంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేషన్ ఇన్‌ఛార్జి కమిషనర్ రవికృష్ణంరాజు, అడిషనల్ కమిషనల్ గుర్రం రవి, మేనేజర్ గిరిజ, రెవెన్యూ సూపరింటెండెంట్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## అందరూ ఆ 'మత్తు'లో వాటాదారులే!



ఇటీవల బుచ్చిరెడ్డిపాలెంలో మద్యం వ్యాపారి నుండి 26వేల రూపాయలు లంచం తీసుకుంటూ హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు ఏసిబికి పక్కాగా చిక్కడం తెలిసిందే! ఈ సంఘటన తర్వాత మద్యం వ్యాపారులు ఒక్కో వైన్‌షాపు నుండి ఒక్కో శాఖకు నెలకు ఎంతెంత మామూళ్ళు ఇస్తున్నారన్న విషయం కూడా బయటకు వచ్చింది. మద్యం వ్యాపారులు వెల్లడించిన మామూళ్ళ వివరాలతో పోలీసు, ఎక్సైజ్ శాఖలలో ప్రకంపనలు మొదలయ్యాయి.

మామూళ్ళ విషయంలో పోలీసులతో పాటు ఎక్సైజ్‌శాఖ నుండి కూడా తీవ్రమైన వేధింపులు ఉంటున్నాయని మద్యం వ్యాపారులు చేసిన ఫిర్యాదుతో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ టి.శ్రీనివాసరావు తీవ్రంగా స్పందించారు. తన శాఖలో మామూళ్ళ భాగోతాలపై విచారణ జరిపించారు. పలువురు ఎక్సైజ్ సిబ్బంది మామూళ్ళు పిండుతున్న విషయం వాస్తవమేనని తేలడంతో బుచ్చి ఎక్సైజ్ సి.ఐ రాంప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ ముఖేష్‌కుమార్ మీనా ఉత్తర్వులు జారీచేశారు.

అలాగే పోలీసుశాఖలోనూ మామూళ్ళ వ్యవహారంపై ప్రకంపనలు మొదలయ్యాయి. ఏసిబికి పట్టుబడ్డ హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు తాము వసూళ్ళు చేసే మామూళ్ళలో ఎవరెవరికి ఎంతెంత వాటా వుంటుందనే విషయాన్ని వెల్లడించాడు. బుచ్చి ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డిని విఆర్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ విశాల్‌గున్నీ ఉత్తర్వులు జారీ చేశారు.

అయితే ఇక్కడ మనం గమనించాల్సింది ఒక్కటే! 'దొరికితేనే దొంగలు... దొరకకుంటే దొరలు' అనే పాలసీ ఇక్కడ అమలవుతుంది. బ్రాందీషాపుల నుండి మామూళ్ళు దండడం అన్నది ఒక్క బుచ్చిరెడ్డిపాలెంలోనే జరగడం లేదు. జిల్లా అంతటా, రాష్ట్రమంతటా కూడా జరుగుతోంది. ప్రతి బ్రాందీషాపు ఓనరూ మామూళ్ళ బాధితుడే! కాకపోతే మిగతా చోట్ల డిపార్ట్‌మెంట్లతో సఖ్యతగా పోతుండబట్టి ఆ విషయాలు బయటకు రావడం లేదంతే!

## బిఎస్ఎన్ఎల్ కొత్త ఆఫర్లు

బిఎస్ఎన్ఎల్ వినియోగదారులకు కొత్త ఆఫర్లు అందుబాటులోకి తీసుకువచ్చిందని ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ ఎం.రవిబాబు ఇటీవల ఓ ప్రకటనలో తెలిపారు. కొత్త ల్యాండ్‌లైన్, బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్ల ఇన్‌స్టాలేషన్ ఛార్జీలు పూర్తిగా ఉచితమన్నారు. కొత్త ల్యాండ్‌ఫోన్ నెలసరి అద్దె రూ.49, బ్రాడ్‌బ్యాండ్ నెలసరి అద్దె రూ.249 అని తెలిపారు. ల్యాండ్‌ఫోన్‌కు స్నేహితులు, ఫ్యామిలీ క్రింద ఒక నెంబరుకు నెలకు రూ.21, రెండు నెంబర్లకు రూ.39, మూడు నెంబర్లకు రూ.49లు ఛార్జీలుగా నిర్ణయించినట్లు వివరించారు. బిఎస్ఎన్ఎల్ ప్రీపెయిడ్ వినియోగదారులకు స్పెషల్ రీఛార్జి రూ.399 ద్వారా రోజుకు 2జిబి డేటా సౌకర్యం 28రోజుల వరకు అందిస్తున్నట్లు తెలిపారు. కావలి, సూళ్లూరుపేట ప్రాంతాల్లో ఫైబర్‌గ్రిడ్ ద్వారా బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. రూ.645లకు 50జిబి వరకు 10ఎంబిపిఎస్ స్పీడ్, ఆ తర్వాత 1ఎంబిపిఎస్ స్పీడ్‌ను పొందవచ్చన్నారు. హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ 1ఎంబిపిఎస్ నుంచి 100 ఎంబిపిఎస్ వరకు పొందవచ్చని వివరించారు.

# అన్నదాతలకు కొండంత అండగా నిలుస్తాం

## - డిసిసిబి ఛైర్మెన్ ధనుంజయరెడ్డి




నెల్లూరుజిల్లా కేంద్ర సహకారబ్యాంకు ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు డిసిసిబి ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి తెలిపారు. నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్ వద్ద వున్న బ్యాంకు ప్రధాన కార్యాలయంలో బ్యాంకు పాలక వర్గ, మహాజనసభ సమావేశాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు శత వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రైతులకు రెండు శాతం వడ్డీ రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపారు. ఖాతాదారులకు బీమా సౌకర్యం కల్పించామన్నారు. సహకార సంఘాల ద్వారా మైక్రో ఏటిఎంలు, రూపే కిసాన్ క్రెడిట్ కార్డులు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నెల్లూరు ప్రధాన కార్యాలయం, నాయుడుపేట, సూళ్ళూరుపేట, పొదలకూరు, కావలి శాఖల పరిధిలో ఏటిఎం సేవలు అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. యాతలూరు సహకార సంఘం ప్రహరీకి రూ.7.86లక్షలు మంజూరు చేశామన్నారు. కోడూరుపాడు, అనంతసాగరం, మోపూరు, ఊసుగుంటపాళెం, నాయుడుపేట, గరిమెనపెంట సహకార సంఘాలలో మొబైల్ బ్యాంకింగ్ సౌకర్యం ఏర్పాటు చేస్తున్నామన్నారు. యంగ్ ఛాంపియన్స్ ప్రాజెక్ట్ క్రింద పాఠశాల విద్యార్థులకు 3315 ఖాతాలు తెరిచి వారికి ఎంబోజింగ్ కార్డులు అందజేసామన్నారు. పంట రుణాలు పొందిన రైతులకు రూపే కేసిపి కార్డులు అందజేసామన్నారు.

### పండుగలా శతాబ్ది ఉత్సవాలు

బ్యాంకు వందేళ్ళు పూర్తవుతున్న సందర్భంగా శతాబ్ది ఉత్సవాలను రైతులు పండుగలాగా నిర్వహించాలన్నది తమ పాలక మండలి నిర్ణయమని ధనుంజయ తెలిపారు. తెలుగుదేశంపార్టీ పెద్దలు, జిల్లా మంత్రులు, మాజీమంత్రుల సలహాలు, సూచనలు తీసుకుని త్వరలో శతాబ్ది ఉత్సవాల తేదీలను ప్రకటిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో డిసిసిబి ఉపాధ్యక్షుడు నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, సిఇఓ వై.సరిత, డిసివో డి.రాజేశ్వరరావు, ఆప్కో డైరెక్టర్ లోకేశ్వరరావు, డిఎల్‌సివో కె.తిరుపాల్‌రెడ్డి, ఓఎస్‌డి సుధాభారతి, డైరెక్టర్లు మాధవరెడ్డి, బి.వి.గౌడ్, కె.కమలాకర్‌రెడ్డి, దామిశెట్టి సుధీర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.




# ఇది ప్రజా విజయం

- నెల్లూరులో వామపక్షాల విజయోత్సవర్యాలీ

పిడిఎఫ్ గెలుపు ప్రజాస్వామ్య విజయమని ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. ఎమ్మెల్సీలుగా విఠపు బాలసుబ్రహ్మణ్యం, యండపల్లి శ్రీనివాసులురెడ్డిలు గెలుపొందడంతో బుధవారం ఉద్యోగ కార్మిక, ప్రజాసంఘాలు, వామపక్షాల కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నెల్లూరు వీబీఎం కాంపౌండ్ నుంచి విఆర్‌సి సెంటర్ వరకు భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ విఠపు మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఇప్పటివరకు ఒక అభ్యర్థి మూడుసార్లు ఎమ్మెల్సీగా ఎన్నికయింది లేదన్నారు. ఈ విజయం ఏ ఒక్కరిది కాదని, అందరిదని అన్నారు. మన ఐకమత్యం ముందు కార్పొరేట్ శక్తులు తలదించుకోవాల్సి వచ్చిందన్నారు. ఎం.మోహన్‌రావు, మాదాల వెంకటేశ్వర్లరావు, కత్తి శ్రీనివాసులు, దామా అంకయ్య, రామరాజు, మూలం రమేష్, అజయ్‌కుమార్, అన్నపూర్ణమ్మ, శీను నాయక్, గౌస్ బాషా, కుట్టు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన త్యాగరాజ స్మరణోత్సవాలు



భిక్షాటనా పూర్వక శ్రీ త్యాగరాజ స్మరణోత్సవ సభ ఆధ్వర్యంలో 52వ శ్రీ త్యాగరాజ స్మరణోత్సవాలు నెల్లూరు టౌన్‌హాలులో ఈ నెల 17 నుండి 23వ తేదీ వరకు వైభవంగా జరిగాయి. చివరి రోజైన గురువారం ఉదయం 10 గంటల నుండి శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవం మేళతాళాలతో వేద పండితుల వేదమంత్రోచ్ఛారణలతో వైభవంగా జరిగింది. సాయంత్రం ఏకాంతసేవ అలంకార దర్శనంలో శ్రీ స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. వారంరోజులుగా స్థానిక కళాకారుల గాత్ర, వీణ, వయోలిన్ కచ్చేరీలు అందరినీ ఆకట్టుకున్నాయి. హరికథా కాలక్షేపాలు అలరించాయి. చెన్నై నుండి వచ్చిన త్రిచూర్ అండ్ పార్టీ, భారతీ రామసుబ్బన్ అండ్ పార్టీ, గాయత్రీ వెంకట రాఘవన్ అండ్ పార్టీ, డా॥ గణేష్ అండ్ పార్టీ వారి గాత్రకచేరీలు రుద్రాక్షం అండ్ పార్టీ వారి వాద్యసమ్మేళనం, విజయవాడ పోపూరి గౌరీనాథ్ గాత్ర కచ్చేరి, విష్ణుభొట్ల సిస్టర్స్ సరస్వతి, కృష్ణవేణి అండ్ పార్టీ గాత్ర కచ్చేరీలు వీనులవిందుగా సాగాయి. ఈ కార్యక్రమాలను స్మరణోత్సవ సభ అధ్యక్షులు చతుర్వేదుల రామమూర్తి శాశ్వత కార్యదర్శి యనమండ్ర నాగదేవీప్రసాద్, కార్యవర్గ సభ్యులు పర్యవేక్షించారు. కళాకారులందరిని శాలువాలతో, పూలమాలలతో ఘనంగా ప్రతిరోజూ సత్కరించారు. సంగీతప్రియులు సాహితీవేత్తలు, కళాకారులు, సింహపురి ప్రజలు వేలాదిగా పాల్గొని ఈ కార్యక్రమాలను జయప్రదం గావించారు.

# కవితా వైభవానికి సత్కారం



ఈ నెల 22వ తేదీ గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని అన్నమయ్య కళావేదికలో జరిగిన కవిరత్న, జాతీయ కవి నాగభైరవ కోటేశ్వరరావు గారి కవితా వైభవ సభలో నెల్లూరు కవి, ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరుజిల్లా రచయితల సంఘం అధ్యక్షులు, డా॥ నాగభైరవ అవార్డు కమిటీ కార్యదర్శి చిన్ని నారాయణరావును ఘనంగా సత్కరించారు. పలువురు వక్తలు చిన్ని నారాయణరావు కవిగా సాధించిన విజయాలను, చేస్తున్న సాహితీ సేవను, డా॥ నాగభైరవ కోటేశ్వరరావు అవార్డు కార్యదర్శిగా చేస్తున్న సేవలను ప్రశంసించారు. సభాధ్యక్షులుగా ప్రముఖ రచయిత, అనువాదకులు జక్కంపూడి సీతారామారావు పాల్గొన్నారు. గుంటూరు వెంకటేశ్వరస్వామి దేవస్థానం కమిటీ అధ్యక్షులు చిటిపోతు మస్తానయ్య జ్యోతిప్రకాశనం గావించారు. నాగార్జున విశ్వవిద్యాలయం విశ్రాంత రిజిష్ట్రార్ రావెల సాంబశివరావు, ప్రముఖ కవి డా॥ నాగభైరవ జాతీయ అవార్డు గ్రహీత రావి రంగారావు, ప్రముఖ కవి సాహితీ విమర్శకులు సూర్యదేవర రవికుమార్ నాగభైరవ కవితా వైభవాన్ని, నాగభైరవ కోటేశ్వరరావు అవార్డు కోసం చిన్ని నారాయణరావు చేస్తున్న సేవలను సభికులకు తెలియజేశారు. సత్కారం అందుకున్న చిన్ని నారాయణరావును నెల్లూరు కవులు, రచయితలు అభినందించారు.

# యూత్ ఐకాన్... కోటంరెడ్డి



నెల్లూరుజిల్లా నుండి వందమంది సభ్యులతో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి యువసేనను ఏర్పాటు చేస్తున్నట్లు యువసేన అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి ప్రకటించాడు. 22వ తేదీన నెల్లూరులోని రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కమిటీలో నెల్లూరురూరల్ నుండి 25మంది, నగరం నుండి 15మంది, మిగతా ప్రాంతాల నుండి 60మందిని ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. త్వరలో ఈ వందమందితో ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేసి, తమ విధి విధానాలను ప్రకటిస్తామన్నారు. సామాన్య కుటుంబాల నుండి వచ్చినవాళ్ళు కూడా ప్రజాజీవితంలో, ప్రజాసేవలో రాణిస్తారనడానికి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఒక రోల్‌మోడల్. 30ఏళ్ల రాజకీయ జీవితంలో విద్యార్థి దశ నుండి నేటి ఎమ్మెల్యే దశ వరకు ఆయన పడని కష్టాలు లేవు, కన్నీళ్ళు లేవు, ఆయనకు తెలియని లోతులు లేవు... ఆయన ఎక్కని గోతులు లేవు. ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకునే ఈ యువసేనను ఏర్పాటు చేస్తున్నామని విష్ణువర్ధన్‌రెడ్డి చెప్పాడు. ఈ సమావేశంలో పి.సుధాకర్, ప్రవీణ్‌కృష్ణ, శ్రీనివాసులురెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సాయి, మధు తదితరులు పాల్గొన్నారు.

## 29న ఉగాది వేడుకలు

నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ కస్తూర్బా కళాక్షేత్రంలో ఈ నెల 29వ తేదీ ఉదయం ఉగాది వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు నెల్లూరుజిల్లా సాంస్కృతిక మండలి ఛైర్మెన్, జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన కవులు, రచయితలు, కళాకారులను సన్మానిస్తున్నట్లు తెలిపారు. నాదస్వరకచేరి, కవిసమ్మేళనం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కవితా పోటీల్లో పాల్గొనే కవులు ఉగాదికి సంబంధించిన కవితలను 20 వాక్యాలకు మించకుండా ప్రిన్సిపల్, ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాల, ఆర్‌టిసి బస్టాండు దగ్గర, రోటరీ క్లబ్ ఆవరణలో ఈ నెల 26లోగా ఎంట్రీలను అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు 94403 61606 నెంబరులో సంప్రదించాలని కోరారు. ఉగాది వేడుకల కోసం కస్తూర్బా కళాక్షేత్రం ఆధునీకరణ పనులను కూడా వేగవంతంగా చేస్తున్నారు. ఉగాది పండుగ నాడే ఈ కళాక్షేత్రంకి కొత్త వెలుగులు రానుండడం విశేషం.




## 'ప్రభా'తం

# సయోధ్యతోనే సాధ్యం

ఎంతో సున్నితమైన అయోధ్య వివాదానికి కోర్టు వెలుపల ఒక పరిష్కారాన్ని అన్వేషించాలని, అందుకు సంబంధిత పక్షాలన్నీ మరోసారి ప్రయత్నాలు చేయాల్సివుందని తాజాగా సుప్రీంకోర్టు చేసిన సూచన ఎంతైనా ఆహ్వానించదగినది. ఇది చక్కని మార్గదర్శకతను చూపే సూచనే. ఆ వివాదం ఇకనైనా కొలిక్కిరావాలంటే సుప్రీంకోర్టు సూచనలను మార్గదర్శకం చేసుకోవడం ఎంతో ఉత్తమం. ఇరుపక్షాలూ చర్చలు-సంప్రదింపులతో.. సయోధ్యతో ఏకాభిప్రాయానికి రావడమే పరిష్కారానికి మంచిమార్గం.

ఎంతటి జటిలమైన సమస్యలనైనా సయోధ్యతో పరిష్కరించుకోవచ్చు. శాంతియుతంగా.. సుహృద్భావ వాతావరణంలో సానుకూల సంప్రదింపులు-చర్చలతో ఎంతటి సున్నితమైన అంశాలనైనా పరిష్కరించుకునేందుకు మంచి దారులు వేసుకోవచ్చు. ఇప్పుడు తాజాగా భారత సర్వోన్నత న్యాయస్థానం సూచిస్తున్నదదే. ఎంతోకాలంగా నలుగుతున్న జటిల సమస్యకు పరిష్కారం సూచించేందుకు సుప్రీంకోర్టు తీసుకున్న శ్రద్ధ..చొరవ అపూర్వమైనవే. అయోధ్యలోని వివాదాస్పద రామజన్మభూమి-బాబ్రీమసీదు స్థల వివాద పరిష్కారం కోసం సుప్రీంకోర్టు చేసిన సూచనలు సర్వత్రా అందరూ ఆహ్వానించదగినవే. ఎంతో సున్నితమైన ఈ వివాదానికి కోర్టు వెలుపల ఒక పరిష్కారాన్ని అన్వేషించడానికి సంబంధిత పక్షాలన్నీ తప్పనిసరిగా మరోసారి ప్రయత్నాలు చేయాల్సివుందని సుప్రీంకోర్టు చేసిన సూచన ఎంతైనా ఆహ్వానించదగినది. ఇది చక్కని మార్గదర్శకతను చూపే సూచనే. అ అయోధ్య వివాదాన్ని కోర్టు వెలుపల పరిష్కరించుకోవాలని సుప్రీంకోర్టు చేసిన సూచనపై బిజెపి హర్షం వ్యక్తం చేస్తోంది. ఈ వివాదానికి సంబంధించి, మతంతో పాటు, సున్నితమైన భావోద్వేగాలు ముడిపడివున్నందున, ఆ సమస్యను చర్చలద్వారా పరిష్కరించుకోవడం ఎంతో ఉత్తమమని, ఈ సమస్యకు కోర్టు బయటే పరిష్కారం కనుగొనాలని, అంతా కలసి ఈ సమస్యకు ఒక సానుకూల పరిష్కారం కనుగొనాల్సివుందని.. ఆ దిశగా మళ్ళీ ప్రయత్నాలు చేపట్టాలని జస్టిస్ జేఎస్ ఖేహర్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొనడం, తద్వారా ఆ సమస్య పరిష్కారానికి తనవంతు కృషికి సంకల్పించడం ఎంతైనా హర్షదాయకం. అవసరమైతే, ఈ విషయంలో తానే స్వయంగా మధ్యవర్తిత్వం వహిస్తానని, సహచర న్యాయమూర్తులు కూడా ఈ సమస్య పరిష్కారం కోసం సహకరిస్తారని జస్టిస్ ఖేహర్ స్పష్టం చేయడం ద్వారా, ఈ జటిలమైన సమస్య పరిష్కారానికి తమవంతు సహకారం అందించేందుకు ముందుకు రావడం నిజంగా అద్భుతమైన విషయమే. దీంతో, ఈ సమస్యకు ఒక చక్కని పరిష్కారం కుదిరేందుకు మార్గం సుగమం అవుతుందనే ఆశించవచ్చు. ఈ వివాదం అంశం గత ఆరేళ్ళుగా నలుగుతోందని, త్వరలో దీనిపై విచారణ జరగాల్సిన అవసరం వుందని బిజెపి నేత సుబ్రహ్మణ్యస్వామి కోర్టును కోరగా, జస్టిస్ ఖేహర్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ సమస్య పరిష్కారానికి అన్ని భాగస్వామ్య పక్షాలు కలసి మరోసారి ప్రయత్నించాలని, అందరూ కలసి ఏకాభిప్రాయానికి రావాలని స్పష్టం చేసింది. అంతేకాదు, 'ఈ వివాదానికి ముగింపు పలకడానికి అవసరమైతే మధ్యవర్తిని ఎంపిక చేసుకోండి. చర్యల కోసం ఇరుపక్షాలూ ఎంపిక చేసుకునే మధ్యవర్తితో నేను మాట్లాడాలని ఉభయులూ కోరుకున్నట్లయితే దానికి నేను కూడా సిద్ధమే''..అని జస్టిస్ ఖేహర్ స్పష్టం చేయడం.. త్వరితగతిన సమస్య పరిష్కారమయ్యేందుకే. ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో..ఈ వివాదాన్ని అర్థవంతంగా, చిత్తశుద్ధితో పరిష్కరించుకోవచ్చని, అమోదయోగ్య పరిష్కారం కోసం అవసరమైతే తమ సేవల్ని అందించేందుకు సిద్ధమేనని చెప్పడం ద్వారా ఆ సమస్య పరిష్కారానికి అవసరమైన సంప్రదింపుల ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్లయింది. ఇరువర్గాలూ కోరుకుంటే ప్రధాన మధ్యవర్తిని తామైనా నియమిస్తామని జస్టిస్ సంసిద్ధత వ్యక్తం చేస్తూ, దీనిపై సంబంధిత పక్షాలతో సంప్రదింపులు జరిపి నిర్ణయమేమిటో ఈ నెల 31న తమకు తెలియజేయాలని కూడా ఆదేశించారు. దీంతో, సుప్రీంకోర్టు సూచనలతో.. అందరి సహకారం.. ఆమోదంతో ఇక ఈ సమస్య త్వరలోనే ఒక పరిష్కారానికి రావచ్చనే అభిప్రాయాలు సర్వత్రా వినవస్తున్నాయి. అయినా 'రామజన్మభూమి-బాబ్రీమసీదు'కు సంబంధించిన వివాదం ఇప్పటిది కాదు. మనదేశంలో ఏళ్ళతరబడి నలుగుతున్న సమస్య ఇది. ఎంతోకాలంగా ఇది వివాదంగానే వుంది. 1992 డిసెంబరు 6న కూల్చివేతకు గురైన ఆ వివాదాస్పద కట్టడ స్థలం కేంద్ర సున్నీ వక్ఫ్‌బోర్డుకు చెందుతుందా, అఖిలభారత హిందూ మహాసభకు చెందుతుందా అనే వివాదం తలెత్తింది. అక్కడ రామమందిర నిర్మాణం జరగాలంటూ బిజెపి నేత సుబ్రహ్మణ్యస్వామి గతంలో పిటిషన్ వేసివున్నారు. అంతేకాదు, మందిరం నిర్మాణాన్ని అనుమతించాలంటూ గతంలో ఆయన మరో పిటిషన్ కూడా వేసివున్నారు. ఇదిలావుంటే, వివాదాస్పద స్థలాన్ని మూడు సమానభాగాలుగా విభజించాలని, వాటిని సున్నీ వక్ఫ్‌బోర్డు, నిర్మోహి అఖడా, రాం లల్లాకు పంచాలని 2010లో అలహాబాద్ హైకోర్టు ధర్మాసనం తీర్పునిచ్చిన విషయం విదితమే. అయితే, 2011లో ఈ తీర్పును సవాల్ చేస్తూ హిందూ, ముస్లిం సంస్థలు పిటిషన్లు దాఖలు చేశాక, అలహాబాద్ హైకోర్టు తీర్పు అమలును నిలిపివేస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలు జారీచేసింది. ఆ తర్వాత, ఆ స్థలంలో ఆలయం నిర్మించేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ 2016లో బిజెపి నేత సుబ్రహ్మణ్యస్వామి పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌ను త్వరగా విచారించాలని ఆయన తాజాగా కోరడంతో, సుప్రీంకోర్టు ధర్మాసనం ఆ మేరకు ఈ వివాదం పరిష్కారానికి తగు సూచనలు చేసింది. ఏదేమైనా, ఈ వివాదం ఇకనైనా ఒక కొలిక్కిరావాలంటే సుప్రీంకోర్టు సూచనలను మార్గదర్శకం చేసుకోవడం ఎంతో ఉత్తమం. సర్వోన్నత న్యాయస్థానం సూచించిన మేరకు ఇరుపక్షాలూ చర్చలు-సంప్రదింపులతో..అందరూ ఏకాభిప్రాయానికి రావడమే మంచిమార్గం. అందుకు అందరూ కలసి చర్చించుకుని సమస్య పరిష్కారానికి కృషిచేయాల్సిన అవసరం ఎంతైనా వుంది. అయోధ్య వివాదం పరిష్కారం సయోధ్యతోనే సాధ్యమవుతుందని భావించవచ్చు. అందుకు ఇది సానుకూల సమయం కూడా. ఒకవైపు కేంద్రంలో మోదీ ప్రభుత్వానికి సంపూర్ణమైన మెజారిటీ వుండడం, మరోవైపు ఉత్తరప్రదేశ్‌లో బిజెపికి అత్యధిక మెజార్టీ రావడం.. ఈ తాజా పరిణామాలతో అయోధ్య సమస్య కూడా ఒక కొలిక్కి వచ్చేదిశగా ప్రయత్నాలు ప్రారంభం కావడం ఒక ముందడుగేనని భావించవచ్చు.

## మే 14న బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక



తెలుగు బ్రాహ్మణ వివాహ సమాచార కేంద్రముల అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్రహ్మణ సేవాసంఘ సమాఖ్య, బ్రాహ్మణ ఉచిత సమాచార కేంద్రం నెల్లూరు వారు సంయుక్తంగా 15వ రాష్ట్రస్థాయి బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదికను మే14వతేదీ ఆదివారం ఉదయం 9గంటల నుండి నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట, పప్పులవీధిలోని సుమంగళి కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు ఏపి రాష్ట్ర బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు వెల్లంచేటి చంద్రమౌళి తెలిపారు. వివాహ పరిచయవేదికలో పాల్గొనేందుకు తమ పేర్లను ఏప్రిల్ 25వ తేదీలోగా 9849049349, 9985025173, 9441895595 నంబర్లలో నమోదు చేసుకోవాలని కోరారు.

## సీతారాముల వారి తిరునాళ్ళు

నెల్లూరు పొదలకూరురోడ్డు టైలర్స్ కాలనీలో వేంచేసియున్న శ్రీ సీతారాములవారి ఆలయంలో ఏప్రిల్ 5వ తేదీ నుండి 14వ తేదీ వరకు స్వామివారి తిరునాళ్ళను వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కామనూరు కోటేశ్వరరావు తెలిపారు. 5వ తేదీ శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారి అభిజిత్ లగ్నంలో ఉదయం 9.23 నుండి 12.20లోగా అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 11.30గంటలకు అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సీతారాములను దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు. ఇప్పటివరకు ఆలయ నిర్మాణానికి తిరునాళ్ళకు సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## జాతీయ కవిసమ్మేళనంలో రాజుకు సత్కారం



కేంద్ర భారతీయ భాషల సంస్థ – మైసూరు, కేంద్ర సాహిత్య అకాడమి – న్యూఢిల్లీ, ఇండో ఏషియన్ అకాడమీ విద్యాసంస్థలు, కర్ణాటక రచయితల సమాఖ్య, తెలుగుతేజం ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం బెంగుళూరులోని ఇండో ఏషియన్ అకాడమీ సెమినార్ హాల్లో జాతీయ కవిసమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా నెల్లూరు జిల్లాకు చెందిన యువకవి కె.మురళీ మోహన్‌రాజు కవిసమ్మేళనంలో పాల్గొని 'కాలం మీద సంతకం' అనే కవితను వినిపించి అందరినీ అలరించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికారభాషా సంఘం అధ్యక్షుడు పొట్లూరు హరికృష్ణ చేతులమీదుగా సత్కారాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్శిటీ పూర్వ తెలుగుశాఖాధిపతి ఆచార్య మనస చెల్లప్ప, ఆంధ్రప్రదేశ్ అధికారభాషా సంఘం అధ్యక్షుడు పొట్లూరి హరికృష్ణ, బెంగుళూరు ఇండోఏషియన్ విద్యాసంస్థల ఛైర్మెన్ ఆచార్య డా॥ టి.ఏకాంబరం నాయుడు తదితరులు పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన కవులు, రచయితలు పాల్గొని ఉగాది ప్రాముఖ్యతను గురించి వివరించారు.




## అధికార దుర్వినియోగం

అధికారపార్టీ అరాచకాలకు స్థానిక ఎమ్మెల్సీ ఎన్నికలు ఒక ఉదాహరణ. ఈ ఎన్నికల్లో చంద్రబాబు తన స్థాయికి దిగజారి ప్రవర్తించాడు. పోలీసులను, అధికారులను తన పార్టీ కార్యకర్తల మాదిరిగా వాడుకున్నాడు. కడప, నెల్లూరు, కర్నూలు జిల్లాల స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థులు గెలిచి ఉండొచ్చుగాక... కాని ఇది చంద్రబాబు నైతిక ఓటమి. డబ్బులకు అమ్ముడుబోయే నాయకులను కొనగలిగారు. రేపు ప్రజలను కొనలేరు. ఎవరి సత్తా ఏమిటో రేపు అసెంబ్లీ ఎన్నికల్లో తెలుస్తుంది.

**చీర్ల సురేష్, నెల్లూరు.**

## ప్రార్థనా మందిరాలపై నిషేధం?

మనుషులకు నిలువ నీడలేకున్నా దేశంలో ఆలయాలు, చర్చిలు, మసీదులు ఇబ్బడిముబ్బడిగా వెలుస్తున్నాయి. చారిత్రాత్మక దేవాలయాలలో దేవుడికి దీపం, నైవేద్యం పెట్టే దిక్కు లేదు. కాని రోడ్లను, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి గుళ్ళు కడుతుంటారు. ఇటలీ రాజధాని రోమ్‌లో కంటే కూడా నెల్లూరు నగరంలో చర్చిలు ఎక్కువగా వున్నాయని చెప్పడం అతిశయోక్తి కాదేమో! పాకిస్థాన్‌లో కన్నా ఇండియాలో మసీదులు రెట్టింపు ఉంటాయి. ప్రజలకు అవసరానికి మించి ప్రార్థనా మందిరాలు ఉన్నాయి. కొన్నేళ్ళ పాటు ఆయా మతాల ప్రార్థనా మందిరాల నిర్మాణాలపై నిషేధం విధిస్తే కనీసం ప్రభుత్వ స్థలాలన్నా కాపాడినవాళ్ళవుతారు.

**పోలంకి రామ్మోహన్, చెన్నై.**

## ఇక్కడ వద్దంది... అక్కడ ముద్దైందా!

ప్రధాని నరేంద్రమోడీ ఆర్థిక సంస్కరణలవాది. ఉచిత పథకాలకు ఆయన వ్యతిరేకి. 2014 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ప్రచారంలో రైతుల ఋణమాఫీని ఆయన వ్యతిరేకించారు. ఋణమాఫీ మాటను ఆయన నోట చెప్పించాలని టీడీపీ నేత చంద్రబాబు చేసిన ప్రయత్నాలు నిష్ఫలమయ్యాయి. మరి అదే మోడీ నిన్న ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో రైతు ఋణమాఫీ వాగ్దానం ఎలా చేసాడు. ఏపిలో వద్దన్న ఋణమాఫీ యూపీలో ఎలా సాధ్యమవుతుంది. నరేంద్రమోడీ కూడా అందరిలాంటి నాయకుడేనని, ఆయన తలలోనూ అందరు నాయకులకున్నట్లే రెండు నాలుకలు ఉన్నాయనే విషయం అర్థమవుతోంది.

**తొట్టిపాడు ప్రసాద్, విజయవాడ.**



# పని చేశారు...
# ఫలితం సాధించలేకపోయారు!

➢ గెలుపుపై అంచనాలు లేవు! ➢ పక్కా వ్యూహం లేదు!

**అ**త్యంత ప్రతిష్టాత్మకంగా జరిగిన నెల్లూరుజిల్లా స్థానిక సంస్థల ఎన్నికలలో తెలుగుదేశం అభ్యర్థి వాకాటి నారాయణ రెడ్డి 87 ఓట్ల తేడాతో గెలిచాడు. వైకాపా అభ్యర్థి ఆనం విజయకుమార్‌రెడ్డి గట్టి పోటీనే ఇచ్చి ఓడిపోయాడు. ఓ దశలో వైకాపా గెలుస్తుందనే పరిస్థితి కూడా కల్పించారు. అసలు నెల్లూరు జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయాలా వద్దా? అనే మీమాంస పరిస్థితి నుండి వైకాపా ఈ స్థాయి పోటీనివ్వడం గొప్ప విషయమే! మారిన సమీకరణల ప్రకారం జిల్లాలో వైకాపాకంటే తెలుగుదేశంకు 150కి పైగా ఓట్లు ఎక్కువ వున్నప్పటికి, అభ్యర్థి ఆనం విజయకుమార్‌రెడ్డి ధీటుగా పోటీనిచ్చాడు. తెలుగుదేశం వాళ్ళకు రెండు వారాల పాటు కంటి మీద కునుకు లేకుండా చేసాడు. తెలుగుదేశం వాళ్ళు జిల్లాలో అర్ధబలం, అంగబలం మోహరించారు. అధికారాన్ని పూర్తిస్థాయిలో వాడుకున్నారు. అధికారులను కూడా వాడేసుకున్నారు. ఇద్దరు మంత్రులు జిల్లాలోనే తిష్టవేశారు. ఇక జిల్లా తెలుగుదేశం నాయకులంతా తామే పోటీ చేసామన్నంతగా పరుగులుపెట్టారు. చంద్రబాబు, లోకేష్‌లైతే ఉదయం, సాయంత్రం గ్యాప్ లేకుండా సమీక్షలు పెట్టారు. ఇంత చేసినా, తమ క్యాంప్‌లో వైసిపి కంటే దాదాపు 200 మందిని అదనంగా పెట్టుకున్నా గెలిచింది 87ఓట్ల తేడాతో!

అసలు జిల్లాలో వైకాపా నాయకత్వం సరిగా లేక ఇక్కడ ఓడిపోయిందిగాని, పక్కా వ్యూహంతో పనిచేసి వుంటే ఖచ్చితంగా ఇక్కడ వైకాపా గెలిచిఉండేది. ఇక్కడ ఎన్నికల నిర్వహణలో వైకాపా నాయకులు విఫలమయ్యారనే చెప్పవచ్చు. ముఖ్యంగా తెలుగుదేశం అభ్యర్థి వాకాటి నారాయణరెడ్డి మీద ఆ పార్టీ నాయకుల్లోనే వున్న అసంతృప్తిని సొమ్ము చేసుకోలేకపోయారు.

జిల్లాలో వైసిపికి మేకపాటి రాజమోహన్‌రెడ్డి పెద్ద దిక్కుగా వ్యవహరిస్తున్నారు. జగన్ కూడా జిల్లాలో పార్టీ నిర్ణయాలను ఆయనకే వదిలేస్తున్నాడు. ఆయనకు రాజకీయాలు చేతకావు. గాలి వాటంతో గెలుస్తున్నాడు. అసలు నెల్లూరు జిల్లా రాజకీయాలకే ఆయన సూటు కాడు. అయినా ఇక్కడ చక్రం తిప్పాలనుకుంటాడు. పార్టీలో ఇతరులకు అవకాశమివ్వడు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికలను ఎంతో సైలెంట్‌గా చేసివుండొచ్చు. తెలుగుదేశం అభ్యర్థి రూపంలో జిల్లా వైకాపాకు ఓ మంచి అవకాశం కలిసొచ్చినట్లయ్యింది. ఆనం రామనారాయణరెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి అభ్యర్థి అయ్యుంటే వైకాపా ఇక్కడ పోటీ చేయాల్సిన అవసరం కూడా ఉండేది కాదు. వాకాటి కాబట్టి వైకాపాకు ఒక ఛాన్స్ ఇచ్చినట్లయ్యింది. కాని వైకాపా వాళ్లే ఆ ఛాన్స్‌ను మిస్ చేసుకున్నారు.

మొదట్లో వైసిపిలో చేరిన అయిదారు మంది ఎంపీటీసీలకే తెగ ప్రచారం చేసారు. తామేదో ఘనకార్యం చేసినట్లు ఫోజులిచ్చారు. దీంతో చంద్రబాబుకు విషయం తెలిసి జిల్లాపై పట్టు బిగించాడు. తెలుగుదేశంలో వాకాటికి వ్యతిరేకంగా వున్న నాయకులను కూడా దారిలోకి తెచ్చాడు. వారి చేత వాకాటికి పని చేయించాడు. చంద్రబాబు భయంతో వాకాటి మీద వ్యతిరేకత వున్నా కూడా ఏ నాయకుడూ క్రాస్ ఓటింగ్‌ను ప్రోత్సహించలేకపోయాడు. అప్పటికే తెలుగుదేశం శిబిరంలో ఉన్నోళ్లు కూడా కొంత వరకు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డారు. వాకాటిని వ్యతిరేకించే నాయకులు గాని క్రాస్ ఓటింగ్ చేయించుంటే తెలుగుదేశం ఓడేది. వైకాపా వాళ్ళు తొలుత చేసిన ఆగిత్యంవల్లే 'దేశం'లోని వాకాటి వ్యతిరేకులు కూడా బాబు గీసిన గీత దాటలేకపోయారు.

# సోమిరెడ్డికి మెరుగైన ర్యాంకు



***ఇటు నెల్లూరుజిల్లా స్థానిక ఎమ్మెల్సీని గెలవడంతో పాటు అటు జగన్ సొంత జిల్లా అయిన కడప స్థానిక ఎమ్మెల్సీని కూడా తెలుగుదేశం పార్టీ గెలవడంతో పార్టీ శాసన మండలి సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ర్యాంకు మెరుగైనట్లుగా భావిస్తున్నారు. త్వరలో మంత్రివర్గ విస్తరణ జరుగనున్న దృష్ట్యా ఆయనకు ఆ దిశగా అవకాశాలు కూడా బలపడ్డాయి. మంత్రివర్గంలో సోమిరెడ్డి అవసరం ఎంత ఉందన్నది ఈ ఎన్నికల ద్వారా స్పష్టమైంది.***

ఏకకాలంలో సోమిరెడ్డి ఇటు నెల్లూరుజిల్లా ఎమ్మెల్సీ ఎన్నికను చూసాడు, అటు కడపలోనూ ఇన్‌ఛార్జ్‌గా తనదైన రాజకీయ చాణక్యతను ప్రదర్శించాడు. నెల్లూరుజిల్లాలో సర్వేపల్లి నియోజకవర్గం నుండి తన పార్టీ స్థానిక ఓటర్లను నిలుపుకోవడమే కాకుండా వైసిపికి చెందిన పలువురు ఓటర్లను కూడా రాబట్టాడు. పార్టీ అభ్యర్థిగా వాకాటి నారాయణరెడ్డి గెలుపుకు గట్టిగానే కృషి చేసాడు.

ఇక కడపజిల్లాకు ఇన్‌ఛార్జ్‌గా కూడా వ్యవహరించిన ఆయన అక్కడ కూడా తన తెలివి తేటలన్నీ చూపాడు. ముఖ్యంగా వైసిపి సభ్యులపై దృష్టిపెట్టాడు. ఎవరిని ఎక్కడ ఎలా నొక్కాలో అలా నొక్కించేసాడు. ఇందుకోసం బంధుమిత్ర బలగాలను కూడా వాడుకున్నాడు. వై.యస్. కంచుకోట కడపజిల్లాలో తెలుగుదేశం జెండా ఎగరడంలో సోమిరెడ్డి పాత్ర ఎంతైనా వుందని చెప్పొచ్చు.

# కలిసిరాని... వైసిపి పై పందేలు

*వరల్డ్‌కప్ జరుగుతున్నా పందేలే... ఐపిఎల్ మ్యాచ్‌లు జరుగుతున్నా పందేలే... కబడ్డీ పోటీలు, టెన్నిస్ ఆటలు, బ్యాడ్మింటన్ ట్రోఫీలు... ఇలా బెట్టింగ్స్ అనేవి క్రీడలకు బాగా పాకిపోయాయి. అవే బెట్టింగ్స్ రాజకీయాలలోనూ హల్‌చల్ చేస్తున్నాయి. క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతున్నా, ఎక్కడ ఎలక్షన్‌లు జరుగుతున్నా పందేల రాయుళ్ళకు పండుగే!*

మొన్ననే ఐదు రాష్ట్రాల ఎన్నికల మీద భారీగానే పందేలు జరిగాయి. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ గెలుస్తుంది, గెలవదు అన్న పాయింట్ మీద కోట్ల రూపాయల్లో పందేలు కాసారు.

తాజాగా రాష్ట్రంలో జరిగిన మూడు స్థానిక ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి భారీగానే పందేలు పెట్టినట్లు తెలుస్తోంది.



నెల్లూరుజిల్లాలో పోటీపై పందేలు బాగా జరిగాయి. తెలుగుదేశం అభ్యర్థి వాకాటి గెలుపు మీద కొందరు, వైసిపి అభ్యర్థి ఆనం విజయకుమార్‌రెడ్డి గెలుపు మీద కొందరు వేల నుండి లక్షల్లో పందేలు కాసారు. 20వ తేదీ ఫలితాలు వచ్చాయి. తెలుగుదేశం అభ్యర్థి గెలిచాడు. వైసిపి గెలుపు మీద పందేలు కాసినవాళ్ళు డబ్బులు పోగొట్టుకున్నారు. దీన్ని బట్టి చూస్తే వైసిపికి పందేలు కలిసిరావడంలేదనిపిస్తోంది. 2012లో కోవూరు ఉపఎన్నికలు జరిగాయి. వైకాపా అభ్యర్థిగా నిలబడ్డ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిపై కోట్లాది రూపాయల పందేలు జరిగాయి. అయితే ఆరోజు ఆయన గెలుపుపై పందేలు కాయలేదు. మెజార్టీ పాతికవేలు దాటుతుందని, దాటదనే అంశాలపై మాత్రమే పందేలు కాసారు. ఆ ఎన్నికల్లో ఆయన గెలిచినా పాతికవేల మెజార్టీకి 1500ఓట్ల దూరంలో ఆగిపోవడంతో వైసిపి మీద పందేలు కాసిన వాళ్ళందరూ డబ్బులు పోగొట్టుకున్నారు. మళ్ళీ 2014 ఎన్నికల్లోనూ వైసిపి విజయం మీద పందేలు కాసినోళ్ళు నష్టపోయారు. వైసిపి అధికారంలోకి వస్తుందని అప్పుడు భారీగా బెట్టింగ్‌లు పెట్టారు కాని అది జరగలేదు. అలాగే ఇప్పుడు స్థానిక ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ వైసిపిపై పందేలు కాసినవాళ్ళు నష్టపోయారు.

# విశ్వవిద్యాలయం గృహప్రవేశం



వేలాదిమంది విద్యార్థులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం నూతన భవన ప్రవేశం ఎట్టకేలకు జరిగింది. ఈ నెల 20వ తేదీన వెంకటాచలం మండలం కాకుటూరు వద్ద నిర్మించి వున్న సొంత భవనాలలోకి యూనివర్శిటీని మార్చారు. ఉపకులపతి వీరయ్య, రిజిస్ట్రార్ చంద్రయ్యలతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు కలిసి ఉదయం 9గంటలకు కొత్త భవనాల వద్దకు చేరుకున్నారు. విద్యార్థులు తరగతి గదుల్లో పూజలు నిర్వహించారు. తరగతి గదులు, ప్రయోగశాలలు, హాస్టల్ గదులను ఉపకులపతి పరిశీలించారు. అధ్యాపకులు తమ శాఖల గదులను చూసుకుని అక్కడ కావాల్సిన ఏర్పాట్లు చేసుకున్నారు. కొత్త భవనాలలోకి గృహప్రవేశం చేయడంతో ఇక నుండి పరిపాలన, క్లాసుల నిర్వహణ అంతా కూడా ఇక్కడే జరుగనుంది. హాస్టల్స్ మొదలు కావడానికి ఇంకొంత టైం పట్టొచ్చు. అలాగే జాతీయ రహదారి నుండి యూనివర్శిటీ ప్రాంగణం వరకు మంచి రహదారిని ఏర్పాటు చేయాల్సి వుంది.

ఏదేమైనా విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం విషయంలో విద్యార్థులు చేస్తున్న పోరాటంలో రెండు అంశాలు పరిష్కారమయ్యాయి. ఒకటి వివాదాలకు కేంద్రబిందువైన గత రిజిస్ట్రార్ శివశంకర్‌ను తప్పించాలని విద్యార్థులు చేసిన పోరాటం ఫలించింది. శివశంకర్‌ను పాత స్థానానికే పంపడం తెలిసిందే! అలాగే కొత్త భవనాలలోకి యూనివర్శిటీని మార్చాలన్న విద్యార్థి సంఘాల పోరాటం కూడా ఫలించింది. ఇక కొత్త భవనాలలోకి వచ్చాకన్నా యూనివర్శిటీలో వివాదాలు తొలగిపోయి మంచి వాతావరణం నెలకొంటుందని ఆశిద్దాం!

# ఉత్సాహమిచ్చిన విజయం



నెల్లూరుజిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ గెలుపుతో జిల్లా తెలుగుదేశం నాయకులు చంద్రబాబు ముందు ధైర్యంగా నిలబడే పరిస్థితి తెచ్చుకున్నారు. ఈ ఫలితం ఏ మాత్రం తిరగబడివున్నా జిల్లా నాయకులు చంద్రబాబు ముందుకు పోవడానికి జంకాల్సి వచ్చేది.

2014 ఎన్నికల తర్వాత తెలుగుదేశం పార్టీకి జిల్లాలో ఊరట కల్పించిన అంశం ఇదొక్కటే! 2014 ఎన్నికల్లో నెల్లూరు జిల్లాలో వచ్చిన ఫలితాలు చంద్రబాబును తీవ్ర నిరుత్సాహానికి గురి చేశాయి. నెల్లూరు, తిరుపతి లోక్‌సభ స్థానాల్లో తెలుగుదేశం ఓడిపోవడం తెలిసిందే! జిల్లాలో పది అసెంబ్లీలకుగాను మూడింటిలో మాత్రమే తెలుగుదేశం గెలవగలిగింది. అలాగే నెల్లూరు జడ్పీ, నెల్లూరు కార్పొరేషన్‌లను కూడా వైకాపా కైవసం చేసుకోవడం జరిగింది. ఈ జిల్లాలో వచ్చిన ఫలితాలపై చంద్రబాబు మనస్థాపానికిగురై, చాలాకాలం ఈ జిల్లా ప్రజలపై కోపం పెట్టుకున్నారు కూడా! తన వద్దకు వచ్చిన జిల్లా నాయకులతో మీ నెల్లూరుజిల్లాకు ఏమీ అడగొద్దంటూ నిర్మొహమాటంగా చెప్పేవాడు. మళ్ళీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, ఇటీవల కొంచెం కొంచెం నెల్లూరుపై కోపం తగ్గించుకుంటూ వచ్చాడు. ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం ఓడిపోయుండుంటే ఆయనగారి కోపం మళ్ళీ మొదటికొచ్చుండేది. పాపం జిల్లాలో పార్టీ నాయకులంతా తమకు ఇష్టం వున్నా లేకున్నా చంద్రబాబుకు భయపడి వాకాటిని గెలిపించారు. ఈ జీవితానికి ఒక ఘనకార్యం సాధించామని ఊపిరి పీల్చుకున్నారు.

## ఇది ఓటమి కాదు...
# ఓర్పుకు విజయం!



నెల్లూరుజిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ పార్టీ సాంకేతికంగా ఓడిపోయినా నైతికంగా, విలువల పరంగా ఓర్పుపరంగా విజయం సాధించిందని వైకాపా ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. 20వ తేదీ నెల్లూరులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారపార్టీ ఈ ఎన్నికల్లో ఎన్ని అడ్డదారులు తొక్కాలో అన్నీ తొక్కేసిందని, అయినా అతికష్టం మీద గెలిచారని ఎద్దేవా చేశారు. మంత్రి నారాయణ యథేచ్ఛగా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. మా పార్టీ నాయకులపై కిడ్నాప్ కేసులు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టించారు. మీరు ఎవరికి ఓటు వేసారో ఇట్టే తెలిసిపోతుందంటూ స్థానిక ఓటర్లను బెదిరించారు. డబ్బులతో ప్రలోభపెట్టారు. ఇన్ని అడ్డదారులు తొక్కినా వైసిపి అభ్యర్థికి 377 ఓట్లు వచ్చాయి. 200 ఓట్ల మెజార్టీతో గెలుస్తామని మంత్రి నారాయణ ప్రగల్భాలు పలికారు. కాని, ఇంత చేసినా 87ఓట్లతో గెలిచారు. ఇదీ ఒక గెలుపేనా అని ఆయన ఎద్దేవా చేశారు. అధికారపార్టీ ప్రలోభాలకు గురిచేయకుండా, ఎన్నికలను ఎన్నికల మాదిరిగానే జరగనిచ్చి వుంటే వైకాపా వంద ఓట్ల మెజార్టీతో గెలిచి ఉండేదని కోటంరెడ్డి అన్నారు. ఈ ఎన్నికల్లో ప్రలోభాలకు లొంగకుండా పార్టీకి అండగా నిలిచిన కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# నెల్లూరు కబుర్లు

## వెంకయ్య, కిరణ్‌బేడిల పర్యటన





కేంద్ర పట్టణాభివృద్ధి, సమాచార ప్రసారాల శాఖ మంత్రి యం.వెంకయ్యనాయుడు ఈ నెల31, ఏప్రిల్1వతేదీలలో జిల్లాలో పర్యటించనున్నారు. 31వ తేదీ నెల్లూరులోని రిత్విక్ ఎన్‌క్లేవ్‌లో ముప్పవరపు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన ఉచిత కంటి వైద్యశాల, దంత వైద్యశాల మరియు ట్రైనింగ్ సెంటర్లను ప్రారంభించనున్నారు. నెల్లూరులో ఎఫ్ఎం రేడియోస్టేషన్‌కు శంకుస్థాపన, స్వర్ణాల చెరువును పర్యాటక కేంద్రంగా మార్చే పనులకు శంకుస్థాపన చేయనున్నారు. మే1వ తేదీ వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో జరిగే వికలాంగులకు కృత్రిమ పరికరాల పంపిణీ శిబిరంలో పాల్గొంటారు. ఇక్కడ జరిగే మహిళా శాస్త్రవేత్తల సన్మానసభకు పుదుచ్చేరి గవర్నర్ కిరణ్‌బేడీ కూడా హాజరుకానున్నట్లు తెలుస్తోంది.

## ముప్పావుగంటలో కౌంటింగ్

20వ తేదీ రాష్ట్రంలో మూడుచోట్ల స్థానిక సంస్థల ఎన్నికల కౌంటింగ్ జరగడం తెలిసిందే! నెల్లూరుతో పాటు, కడప, కర్నూలులోనూ కౌంటింగ్ జరిగింది. అయితే నెల్లూరులో ముప్పావు గంటలోనే కౌంటింగ్ పూర్తిచేసి ఫలితాన్ని ప్రకటించేసారు. నెల్లూరులో స్థానిక ఎమ్మెల్సీ ఫలితాన్ని ప్రకటించే సమయానికి కడప, కర్నూలులలో మొదటి రౌండ్ ఓట్ల లెక్కింపు కూడా పూర్తి కాలేదు. జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో అధికారులు పకడ్బందీగా చేపట్టిన చర్యల వల్లే చాలా తొందరగా ఫలితాన్ని ప్రకటించేశారు.

## బెంగుళూరు ప్రయాణీకులకు ఆఫర్లు

నెల్లూరు నుంచి బెంగుళూరుకు అమరావతి బస్సులో వెళ్ళే ప్రయాణీకులకు నెల్లూరు ఆర్టీసీ ఆఫర్ ప్రకటించింది. మంగళవారం నుంచి శనివారం వరకు ఛార్జీలో 10 శాతం రాయితీని ఇవ్వనున్నట్లు నెల్లూరు – 2 డిపో మేనేజర్ మురళీ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం నెల్లూరు నుంచి బెంగుళూరుకు ఛార్జీ రూ.903 ఉండగా 10శాతం రాయితీతో రూ.825కే ప్రయాణం చేయవచ్చని తెలిపారు.

## చిరంజీవి యువత రక్తదాన శిబిరం

ప్రఖ్యాత సినీనటులు చిరంజీవి తనయుడు మెగా పవర్‌స్టార్ రామ్‌చరణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని చిరంజీవి యువత ఆధ్వర్యంలో నెల్లూరు రెడ్‌క్రాస్ రక్తనిధిలో ఆదివారం మెగారక్తదాన శిబిరం నిర్వహించారు. దీనిని రక్తనిధి కన్వీనర్ డాక్టర్ సుబ్బారావు ప్రారంభించారు. అధికసంఖ్యలో అభిమానులు పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, చిరంజీవి యువత జాతీయ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు రవికుమార్, కొట్టె వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి, ప్రసాద్, హరి, వంశీ, వేణు, శ్రావణ్, గుర్రం కిషోర్, సనత్, సంతోష్, అలీ తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన వైద్యసేవలందించాలి
### - జిల్లా కలెక్టర్




పేదప్రజలకు నాణ్యమైన వైద్యసేవలను తక్కువ ధరకే అందించాలని నెల్లూరుజిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు పేర్కొన్నారు. నెల్లూరు పొగతోటలోని రిచ్ చిన్నపిల్లల మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలో ఈ నెల 18వ తేదీ న్యూబోర్న్ స్క్రీనింగ్ పరీక్ష యంత్రాన్ని ప్రారంభించిన కలెక్టర్ మాట్లాడారు. పుట్టిన ఏడు రోజుల్లోపు బిడ్డకు భవిష్యత్తులో వచ్చే మానసిక సమస్యలు, మాటలు రాకపోవడం, వినికిడి లోపం తదితర వాటిని కనుక్కొని ముందుగానే నివారించేందుకు పరీక్షలను ఏర్పాటు చేసిన ఆసుపత్రి యాజమాన్యాన్ని అభినందించారు. ఈ వైద్యసేవలను పేదలకు సైతం అందుబాటులో ఉంచాలని సూచించారు. అనంతరం ఆసుపత్రి ఛైర్మెన్ డాక్టర్ టి.రవికుమార్ మాట్లాడుతూ ఈ పరీక్ష ద్వారా 50రకాల లోపాలను గుర్తించవచ్చన్నారు. బిడ్డలకు ఆరోగ్యవంతమైన జీవనం అందించాలనే కారణంతోనే ఖర్చుకు వెనుకాడకుండా స్క్రీనింగ్ సెల్‌ను ఏర్పాటు చేసామన్నారు. వసంతలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ డా॥ టి.వసంతలక్ష్మి, చెన్నై కంచి కామకోటి చైల్డ్ హాస్పిటల్ నియోనటలాజిస్ట్ డా॥ రాహుల్‌యాదవ్, రిచ్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## వాత్సల్యకు మీనాక్షి విద్యాసామాగ్రి



నెల్లూరు కొండాయపాలెంలోని జనహిత వాత్సల్య అనాథాశ్రమానికి ఈ నెల 18వ తేదీ మీనాక్షి ఎనర్జీ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో రూ.50వేలు విలువజేసే స్కూల్ బ్యాగ్స్, నోట్‌పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, ఇతర స్టేషనరీ వస్తువులను కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కమల్‌కాంత్ అందజేశారు. అనాథపిల్లలకు వాత్సల్య అనాథాశ్రమం చేస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. అనంతరం వాత్సల్య పిల్లల నృత్యాలు, కోలాటం, శ్లోకాల పఠనం ఆకట్టుకున్నాయి. కంపెనీ ప్రతినిధి మృత్యుంజయరామ్, వాత్సల్య కార్యదర్శి జి.వి.సాంబశివరావు, హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్‌రెడ్డి, పిఇటి రాజేష్, వై.మల్లిఖార్జున తదితరులు పాల్గొన్నారు.

## రంగనాథుడి హుండీ లెక్కింపు

నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో సోమవారం హుండీని లెక్కించారు. స్వామివారికి భక్తులు జనవరి 1 నుండి మార్చి 20వ తేదీ వరకు కానుకల రూపంలో రూ.10,95,962 సమర్పించారు. ఇందులో కొన్ని రూ.1000, 500 పాతనోట్లు, అమెరికన్ డాలర్లు ఉన్నాయని ఆలయ ఛైర్మెన్ మంచికంటి సుధాకర్‌రావు, ఇ.ఓ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

## 'తహసీన్'ను అభినందించిన ఎస్పీ



ఆల్ ఇండియా సౌత్‌జోన్ కబడ్డీ ఛాంపియన్‌షిప్–2017లో గోల్డ్‌మెడల్ సాధించిన షేక్ తహసీన్‌ను నెల్లూరుజిల్లా ఎస్పీ విశాల్‌గున్నీ శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించి అభినందించారు. పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ 2010లో మరణించిన షేక్ సికిందర్ బాషా కుమార్తె తహసీన్. ఈ సందర్భంగా పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు మాట్లాడుతూ తల్లిదండ్రులను కోల్పోయిన తహసీన్ అక్క మెహస్సీన్ కారుణ్య నియామకం క్రింద ఉద్యోగం పొంది తమ్ముడును బిటెక్ చదివిస్తూ, చెల్లెలును గొప్ప కబడి క్రీడాకారిణిగా తయారు చేసినందుకు ప్రత్యేకంగా మెహస్సీన్‌ను అభినందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు శివకుమార్, రమణయ్య పాల్గొన్నారు.

## వాకాటిని సత్కరించిన మెట్టుకూరు



నెల్లూరు కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్ పదవి తనకు రాజకీయంగా ఎదిగేందుకు జన్మనిచ్చిందని ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం ఎమ్మెల్సీగా ఎన్నికైన తర్వాత తొలిసారిగా నెల్లూరు నగరంలోని డిసిసిబి కార్యాలయంలో అడుగుపెట్టారు. ఈ సందర్భంగా డిసిసిబి ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం వాకాటిని ఛైర్మెన్, డైరెక్టర్లు పలువురు ఘనంగా సత్కరించారు. వాకాటి మాట్లాడుతూ రాజకీయ పాఠాలు నేర్చుకొనేందుకు డిసిసిబి ఒక విద్యాలయమని అభివర్ణించారు. బ్యాంకు అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. వైస్‌ఛైర్మెన్ నల్లపురెడ్డి జగన్మోహన్‌రెడ్డి, డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## బాలసదన్‌కు ఫ్యాన్ల వితరణ



నెల్లూరులోని స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలసదన్‌కు ఏ.సి సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బాసం శేషగిరిరావు, ఆదిలక్ష్మి దంపతులు ఫ్యాన్లను అందజేశారు. వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ డాక్టర్ అంకిరెడ్డి దుప్పట్లను పంపిణీచేశారు. వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 203 డిప్యూటీ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు, డాక్టర్ సత్యనారాయణ పాల్గొని బాలసదన్‌కు నెలలో ఒకరోజున కోడిగుడ్లు ఏడాదిపాటు అందజేస్తామన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు వేలూరు రంగారావు, కోశాధికారి పొన్నం రవిచంద్ర, సభ్యులు, బాలసదన్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, మానస తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యశ్రీని అనారోగ్యశ్రీని చేసారు

## అసెంబ్లీలో అనిల్ ధ్వజం



పేద ప్రజల ఆరోగ్య భద్రత కోసం దివంగతనేత డాక్టర్ వై.యస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్య శ్రీ పథకాన్ని ఈ ప్రభుత్వం అనారోగ్యశ్రీగా మార్చిందంటూ నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్ యాదవ్ ధ్వజమెత్తారు. 20వ తేదీ శాసనసభా సమావేశాలలో ఆయన ఆరోగ్యశ్రీపై ప్రభుత్వాన్ని పలు ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేసారు. ప్రభుత్వ ఆసుపత్రులలో వసతులు ఎంత ఘోరంగా ఉన్నాయో మనం చూస్తున్నాం. ఒక మహిళ తన భర్తను హాస్పిటల్‌లో వార్డుకు తీసుకెళ్ళడానికి స్ట్రెచ్చర్ లేక ర్యాంపుపై ఈడ్చుకు పోవడం లోకమంతా చూసింది. గుంటూరు ఆసుపత్రిలో పసిబిడ్డను ఎలుకలు కొరికి చంపేసాయి. ఆరోగ్యశ్రీలో ట్రామా యాక్సిడెంట్ కేసులకు ఇచ్చే 50వేల రూపాయలు సరిపోకపోతుండడంతో ప్రైవేట్ ఆసుపత్రులు ఆ కేసులను తీసుకోవడం లేదు. రాష్ట్రంలో సరైన క్యాన్సర్ ఆసుపత్రి లేక, క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు పక్క రాష్ట్రాలకు పోయి అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. రాష్ట్రంలో దాదాపు మూడున్నర లక్షల మంది కిడ్నీ వ్యాధిగ్రస్తులున్నారు. వారిలో ఒకటిన్నర లక్షల మంది పరిస్థితి ప్రమాదకరంగా వుంది. ఒక్కో పేషంట్‌కు సంవత్సరానికి 3లక్షల 20వేలు ఖర్చవుతుంది. రాష్ట్రంలో వ్యాధిగ్రస్తులకు సరిపడా ఆసుపత్రులు లేవని, కాబట్టి ఆసుపత్రుల సంఖ్యను పెంచాలని అనిల్ కోరారు. ఆరోగ్యశ్రీకి ఎన్టీఆర్ వైద్యసేవ అని పేరు పెట్టిన తెలుగుదేశం వాళ్ళు ఎన్టీఆర్‌కు ఏ విధంగా అన్యాయం చేసారో, ఎన్టీఆర్ వైద్యసేవలకు కూడా అదే విధంగా అన్యాయం చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

# విశ్వాసహీనులుగా మిగిలిపోతారు!

## వెన్నుపోటుదారులపై నిప్పులు చెరిగిన ఆనం విజయ




వై.యస్ బొమ్మతో ఫ్యాన్ గుర్తుతో, జగన్ ప్రజాదరణతో గెలిచి, స్థానిక సంస్థల ఎన్నికల్లో వైకాపాకు వెన్నుపోటు పొడిచిన నాయకులందరూ చరిత్రలో విశ్వాసహీనులుగా మిగిలిపోతారని నెల్లూరుజిల్లా స్థానిక సంస్థల వైకాపా అభ్యర్థి ఆనం విజయకుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. 20వ తేదీ వెల్లడైన ఎమ్మెల్సీ ఫలితాల్లో ఆయన ఓడిపోవడం తెలిసిందే! 21వ తేదీ నెల్లూరులోని జిల్లా వైకాపా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం పెట్టారు. ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడే ముక్కుసూటి మనిషిగా ఆయనకు పేరుంది. విలేకరుల సమావేశంలోనూ ఆయన అదే విధంగా మాట్లాడారు. ఈ ఎన్నికల్లో ఓటమి మమ్మల్ని ఏ విధంగానూ బాధపెట్టలేదు. ఈ ఫలితాలు ఇంకా మా మానసిక స్థైర్యాన్ని పెంచాయి. అధికారపార్టీ వాళ్ళు ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా, ఎన్ని అక్రమ కేసులు పెట్టినా, ఎన్ని కోట్లు కుమ్మరించినా 377 మంది స్థానిక ప్రతినిధులు మాకు వెన్నుదన్నుగా నిలిచారు. మా పార్టీ జిల్లా నాయకులందరూ నిస్వార్థంగా కష్టపడి పనిచేశారు. కేవలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గుర్తు మీద గెలిచి అధికారపార్టీ విసిరిన ఎంగిలిమెతుకులకు ఆశపడి వెన్నుపోటు పొడిచిన విశ్వాసహీనులు, నమ్మకద్రోహుల వల్లే ఓడిపోయాం. ఒక పార్టీ గుర్తు మీద గెలిచి, ఇంకో పార్టీలోకి మారిన ఈ హీనులను అప్పుడే మా కార్యకర్తలు చెప్పుతో కొట్టి వుంటే ఇంకొకడు ఆ పని చేసేవాడు కాదు. ఏ పార్టీ వాళ్ళైనా సరే ఒక పార్టీ గుర్తు మీద గెలిచి నప్పుడు ఇంకో పార్టీలోకి వెళ్ళాలంటే ముందు ఆ పదవులకు రాజీనామా చెయ్యాలి. పార్టీకి వెన్నుపోటు పొడిచిన ద్రోహులందరికీ ఒక్కటి చెబుతున్నా! మీరు దేవుడిని చూడడానికి కాశీకో, తిరుమలకో, కాణిపాకంకో పోబల్లేదు, మనుబోలు పోండి, ఎంపిపి పద్మమ్మను చూడండి, విశ్వాసానికి నిలువెత్తు రూపం ఆ తల్లి. ఓ పక్క కన్నకొడుకు చితి కాలుతుండగానే ఇంకో పక్క తనను ఆ స్థానంలో వుంచిన జగన్ పట్ల విశ్వాసంతో పుట్టెడు దుఃఖాన్ని దిగమింగుకుని వచ్చి ఓటేసింది. విశ్వాసానికి, పార్టీ పట్ల అంకిత భావానికి ప్రతిరూపంగా నిలిచింది. ఆ తల్లి విశ్వాసానికి నేను పాదాభివందనం చేసాను. పార్టీ పాలు తాగి పార్టీ రొమ్ము గుద్దిన ద్రోహులతో కాదు, పద్మమ్మలాంటి విశ్వాసపాత్రులతో 2019 ఎన్నికల్లో వైకాపా విజయ దుంధుభి మోగిస్తుందని ఆనం విజయకుమార్‌రెడ్డి పేర్కొన్నారు.

# స్వచ్ఛంద వాలంటీర్లకు ఇంటర్వ్యూలు



నెల్లూరు రెడ్‌క్రాస్ సొసైటీలోని 12 విభాగాలలో స్వచ్ఛందంగా వాలంటీర్లుగా పనిచేయడానికి ఆసక్తి కలిగిన సభ్యులకు సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు, జాయింట్ కలెక్టర్ ఎఎండి ఇంతియాజ్, డిఎంహెచ్ఓ డా॥ వరసుందరం, రెడ్‌క్రాస్ సొసైటి అధ్యక్షులు డా॥ ఏ.వి.సుబ్రహ్మణ్యం, బిసిహెచ్ఎస్ డా॥ సుబ్బారావు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

# నైపుణ్యాభివృద్ధితోనే మంచి జీ(వి)తాలు




ఉద్యోగులు ఎప్పటికప్పుడు ఆయా రంగాల్లో నైపుణ్యాన్ని అభివృద్ధిపరచుకుంటే మంచి జీతభత్యాలతో, మంచి జీవితాలతో రాణించవచ్చని వక్తలు పేర్కొన్నారు. ముత్తుకూరు మండలంలోని కృష్ణపట్నం పోర్ట్ ప్రాంగణంలో వున్న కృష్ణపట్నం సెక్యూరిటీ సర్వీసెస్ ట్రెయినింగ్ అకాడమీలో ఉద్యోగులకు 'నైపుణ్యాభివృద్ధి'పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.చిరంజీవి మాట్లాడుతూ, ఉద్యోగులంతా ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొని తమ నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ట్రెనింగ్ అకాడమీ ప్రిన్సిపాల్ టి.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమాన్ని ప్రధానంగా సెక్యూరిటీ, డ్రైవింగ్, వెల్డింగ్, ఆఫీస్ స్టాఫ్, టెక్నీషియన్స్, హౌస్‌కీపింగ్, వర్కర్స్ తదితర ఉద్యోగులు, సిబ్బందికి నిర్వహిస్తున్నామని, ఈ శిక్షణ వారికి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ శిక్షణలో నైపుణ్యాభివృద్ధితో పాటు, ప్రథమ చికిత్స, ప్రమాదాలు జరగకుండా ముందుజాగ్రత్త తీసుకోవడం, మంటలను ఆర్పడంతో పాటు ఆంగ్లభాషలోను, కంప్యూటర్ రంగంలోనూ తగు శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ శిక్షణలో పాల్గొన్న ఉద్యోగులకు పదోన్నతి తదితర అంశాల్లో తగు ప్రాధాన్యతను ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సెక్యూరిటీ ఏజిఎం టి.కె మనోహర్‌బాబు, కో-ఆర్డినేటర్ అనిల్‌కుమార్ తదితరులతో పాటు, శిక్షణా సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

# బీజేపీని బలోపేతం చేస్తాం



నెల్లూరుజిల్లాలో బీజేపీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని పార్టీ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ 2019 ఎన్నికల నాటికి పార్టీని పటిష్టం చేసేందుకు బూత్ స్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ నెల 24, 25 తేదీలలో కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు జిల్లాలో జరిగే వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. బిట్రగుంటలో రైల్వే రోలింగ్ స్టాక్, కాంపోనెంట్ రిహాబిలిటేషన్ వర్క్‌షాపును ఏర్పాటు చేయాలని వెంకయ్యనాయుడిని కోరామన్నారు. అలాగే ఇఎస్ఐ వంద పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని విన్నవించామన్నారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి మాట్లాడుతూ ఏపి ప్యాకేజికి కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధత కల్పించడంతో విమర్శకుల నోళ్ళు మూత పడ్డాయన్నారు. హైకోర్టు తీర్పు దృష్ట్యా విఆర్ విద్యాసంస్థల ఆస్తుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. పార్టీ నగర అధ్యక్షుడు మండ్ల ఈశ్వరయ్య, బండారు శ్రీనివాసులు, యర్రబోలు రాజేష్, కాయల మధు, పరుశురాం, గడ్డం విజయకుమార్, శ్రీనివాసులు, నాగేంద్ర, ప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బెంగుళూరులో...

# నెల్లూరు కవుల కవితాగానం



జాతీయస్థాయిలో బెంగుళూరులో ఈనెల 19న నిర్వహించిన కవిసమ్మేళనంలో నెల్లూరుకు చెందిన పలువురు కవులు పాల్గొని తమ కవితలను వినిపించి అందరి ప్రశంసలూ అందుకున్నారు. కేంద్ర భారతీయభాషల సంస్థ (మైసూరు), కేంద్ర సాహిత్య అకాడమీ (న్యూఢిల్లీ), కర్నాటక తెలుగు రచయితల సమాఖ్య, తెలుగుతేజం ఫౌండేషన్‌ల సారథ్యంలో, ఇండో-ఏషియన్ అకాడమీ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాతీయస్థాయి శతాధిక తెలుగు ఉగాది కవిసమ్మేళనంలో గుండాల నరేంద్రబాబు, అవ్వారు శ్రీధర్‌బాబు, గోవిందరాజు సుభద్రాదేవి, ములుగు లక్ష్మీమైథిలి, మాటేటి రత్నప్రసాద్, డాక్టర్ దివిజాదేవి, డాక్టర్ కె. ఈశ్వరమ్మ, డాక్టర్ పద్మప్రియ, డాక్టర్ టి. మాలకొండయ్య, పెనగలూరి కుమార్, జి.లలిత, ములుగు విజయదుర్గ, సిఎంఆర్ విష్ణుకుమార్, మురళీమోహన్‌రాజు, నివాస్ తదితరులు పాల్గొని కవితాగానం చేశారు. సిఐఐఎల్ (మైసూరు) డైరెక్టర్ ప్రొఫెసర్ డిజి రావు, కర్నాటక తెలుగు రచయితల సమాఖ్య అధ్యక్షుడు సిరిపంగి మహేశ్వర్, బొగ్గవరపు మాల్యాద్రి, కె. వెంకటేశ్వరశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

## గూడూరు డివిజన్ వార్తలు

# పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుదాం

**ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు స్నేహలతారెడ్డి**



ఫ్రెండ్స్ సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొన్న ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు వై.స్నేహలతారెడ్డి, ఆంధ్రాబ్యాంకు మేనేజర్ రాజేష్

ప్రతిఒక్కరు కూడా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని గూడూరు ఆంధ్రాబ్యాంకు మేనేజర్ రాజేష్, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు వై. స్నేహలతారెడ్డి తెలిపారు. గూడూరు పట్టణం సొసైటీ ప్రాంతంలో ఫ్రెండ్స్ సమాఖ్య ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరు పురపాలక పరిధిలోని తమతమ వార్డులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తద్వారా ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు యారం మంజుల, సునందారెడ్డి, రజనీ, ప్రమీల, సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.



ఈ నెల 21వ తేదీన తూర్పుకనుపూరు గ్రామంలోని శ్రీ ముత్యాలమ్మతల్లి జాతరమహోత్సవాలను ప్రత్యేకపూజలు నిర్వహించి ప్రారంభిస్తున్న గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

## ఉపకారవేతనానికి చవటపాళెం జడ్పీ విద్యార్థి



గిరిధర్

గూడూరు మండలం చవటపాళెం జడ్పీ ఉన్నతపాఠశాలకు చెందిన విద్యార్థి ఉపకార వేతనానికి అర్హత సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయుదు పురంధర్‌రాజు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది నవంబర్ 6న గూడూరులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన నేషనల్ మీన్స్‌కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్‌కు తమ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న గిరిధర్ పరీక్షలు రాయగా అర్హత సాధించాడన్నారు. దీంతో ఇటీవల ప్రతిభ చాటిన విద్యార్థిని అభినందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుత్తి వేణుగోపాల్, రేవతీకుమారి, నాగమణి, కవిత, మంగారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసేవలకు బహుమానం

**- ఎమ్మెల్యే పాశం సునీల్**



ఎమ్మెల్సీ వాకాటిని అభినందిస్తున్న ఎమ్మెల్యే పాశం

తెలుగుదేశంపార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి వాకాటి నారాయణరెడ్డి గెలుపు తెలుగుదేశంపార్టీ చేస్తున్న ప్రజాసేవలకు బహుమానం అని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. గూడూరు ప్రజాప్రతినిధులతో కలిసి సోమవారం పట్టణంలో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశంపార్టీ చేసిన అభివృద్ధితోనే గెలుపు సాధించడం సంతోషకరమన్నారు. గెలుపుకు కృషిచేసిన ప్రజాప్రతినిధులను ప్రశంసిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీగా గెలుపొందిన నారాయణరెడ్డిని ఎమ్మెల్యేతో పాటుగా పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు అభినందించారు.

# పన్నులు చెల్లించకుంటే కఠిన చర్యలు



మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

గూడూరు మున్సిపాలిటీకి దీర్ఘకాలంగా పన్నులు చెల్లించని మొండి బకాయిదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. ఈ నెల 18వ తేదీ పట్టణంలోని ప్రధాన రహదారుల్లో మున్సిపల్ అధికారులు జప్తు వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఆస్తి, కొళాయి పన్నులు కోట్లాది రూపాయలు బకాయిలు ఉన్నాయన్నాయని, ఇప్పటికే బకాయిదారులకు పలుమార్లు నోటీసులు అందజేసి వ్యక్తిగతంగా కలుసుకొని, వారి బకాయిలను సకాలంలో చెల్లించాలని కోరామన్నారు. రాష్ట్రంలోనే పన్నులు బకాయిల వసూళ్లలో గూడూరు మున్సిపాలిటీ చివరి స్థానంలో ఉండటంతో బకాయిదారుల పట్ల కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందన్నారు. గడువులోగా బకాయిలు చెల్లించాలన్నారు. లేని పక్షంలో వారి పేర్లను లోకల్ మీడియాలో ప్రకటించడంతో పాటు పట్టణంలోని పలు కూడళ్ళ వద్ద వారి పేర్లతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తామన్నారు. ఆస్తి పన్ను వ్యవహారంలో ఏమైనా సందేహాలు ఉంటే స్థానిక కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్వో కృష్ణారెడ్డి, మేనేజర్ భాస్కర్, అధికారులు రమణారెడ్డి, గిరిబాబు, సతీష్, దశయ్య, పెంచలయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

# సన్యాసుల పాలనలోనే శాంతి సౌభాగ్యాలు

శ్రీను గల్పిక

భేతాళకథ

పట్టువదలని హైటెక్ విక్రమార్కుడు ఎర్లీమార్నింగ్ ఎయిట్ థర్టీకల్లా నిద్ర లేచాడు. బాత్‌రూంకు వెళ్ళి పొద్దున చేయాల్సిన పనులన్నీ ముగించుకుని మద్రాసుబస్టాండ్ వద్దనున్న మురళీకృష్ణ హోటల్‌లోకి వెళ్ళాడు. మూడు ఇడ్లీలలో మూడు బకెట్ల సాంబార్ లాగించి మళ్ళీ రోడ్డు మీదకొచ్చాడు. ఆయన రోడ్డు పక్కన నిలబడ్డాడోలేదో ఆయన ముందు పాతిక ఆటోలు ఆగాయి. విక్రమార్కుడు ఒక ఆటోలో ఎక్కబోయేలోపే ఇంకో ఆటో సర్రున దూసుకొచ్చింది. ఒక్క ఉదుటున విక్రమార్కుడిని ఆ ఆటోలోకి లాక్కుని ఆటోవాలా షార్ నుండి వదిలిన రాకెట్‌లా ముందుకు దూసుకుపోయాడు. చిత్తశుద్ధితో టైం టూ టైం విధులు నిర్వహించే వైద్యులు పనిచేస్తున్న పెద్దాసుపత్రి ముందు ఆటో ఆగింది. విక్రమార్కుడు అక్కడ దిగి పెద్దాసుపత్రిలోకి వెళ్లాడు. ఆసుపత్రి ప్రాంగణంలో ఎటు చూసినా పెద్ద పెద్ద భవనాలు కనిపించసాగాయి. విక్రమార్కుడు మనసులో... ఇక్కడ మెడికల్ కాలేజీ రాకముందే బాగుండింది, మార్చురీ ఎక్కడ వుందో ఈజీగా అర్థమయ్యేది, ఇన్ని బిల్డింగ్‌ల మధ్య మార్చురీ ఎక్కడ ఉందో అనుకుంటూ అక్కడే వున్న వార్డుబాయ్‌ని మార్చురీకి ఎటు వెళ్ళాలని అడిగాడు. అతను చెప్పిన రూట్‌లో వెళ్ళి విక్రమార్కుడు మార్చురీకి చేరుకున్నాడు. అక్కడ కల్తీసారా తాగి చనిపోయిన ఓ వ్యక్తి బాడీని భుజాన వేసుకుని బోడిగాడి తోటలోని రోటరీ క్లబ్ శ్మశానవాటిక వైపు బయల్దేరాడు విక్రమార్కుడు. ఆయన అలా నడుచుకుంటూ యం.జి మాల్ వద్దకు వచ్చేసరికి ఎండ బాగా కాస్తుండడంతో నీరసం వచ్చేసింది. ఇంత దూరం నడిచినా శవంలోని భేతాళుడిలో ఉలుకు పలుకు లేదేంటబ్బా అనుకుంటూ విక్రమార్కుడు... భేతాళ... భేతాళ అంటూ భుజం మీద వున్న డెడ్‌బాడీని గట్టిగా తట్టాడు. అప్పుడు బాడీలోని భేతాళుడు... నీరసంగా ఊ కొట్టాడు. విక్రమార్కుడు వుండి... రొటీన్‌గా నువ్వు చెప్పే సోది చెప్పి, అడిగే క్వశ్చన్ అడిగితే ఈరోజుకు నా బాధ్యత తీరి రూమ్‌కు పోయి రెండు బీర్లు కొట్టి పడుకుంటానన్నాడు. అప్పుడు భేతాళుడు... ఆ బీర్ ఏదో ఇప్పుడే కొడదాం పదా.. అలా బార్‌కెళ్లి కూర్చుని మాట్లాడుకుందాం అంటూ హోటల్ డి.ఆర్ ఉత్తమలోని బార్‌కి వెళ్లారు. నాలుగు బీర్లు ఆర్డర్ చేసుకున్నారు. విక్రమార్కుడి రిక్వెస్ట్‌తో భేతాళుడు లేటెస్ట్ పొలిటికల్ స్టోరీ ఒకటి చెప్పడం మొదలు పెట్టాడు.

రాజా, ఇటీవలే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ముగిసాయి. అన్ని పార్టీలు కూడా ప్రతిష్టాత్మకంగా భావించిన ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ గెలుపొందడం చూసే ఉంటావు. యూపీ ముఖ్యమంత్రి పదవి కోసం రాజ్‌నాథ్‌సింగ్, దినేశ్ శర్మ, కేశవ ప్రసాద్‌మౌర్య లాంటి వాళ్ళు పోటీ పడ్డారు. అందరూ కూడా వీరిలో ఒకరిని ముఖ్యమంత్రి పదవి వరిస్తుందని ఊహించారు. అయితే ప్రధాని నరేంద్రమోడీ అనూహ్యంగా పెళ్ళి పెటాకులు లేని యోగి ఆదిత్యనాథ్‌ను సీఎంగా ఎంపిక చేశారు. ముఖ్యమంత్రి పదవికి సంసారులు ఎంతో మంది లైన్‌లో వుండగా సన్యాసి అయిన యోగిఆదిత్యనాథ్‌ను సీఎంను చేయడంలో ప్రధాని నరేంద్ర మోడీ ఆంతర్యం ఏమిటి? ఈ ప్రశ్నకు సమాధానం తెలిసి కూడా చెప్పక పోయావో నేను పుట్టినప్పటి నుండి 'ఈ'టీవీలో వస్తున్న 'పెళ్లాం కొట్టిన మేకులు... మొగుడు పెట్టిన కేకలు' సీరియల్‌ను మొదటి ఎపిసోడ్ నుండి మొత్తం చూపిస్తానన్నాడు. ఆ మాటకు విక్రమార్కుడు భయపడి... భేతాళ అంత పనిచేయొద్దు, ఇది సింపుల్ క్వశ్చన్... ప్రధాని నరేంద్రమోడీ లక్ష్యం ప్రశాంతమైన భారతదేశాన్ని నిర్మించడం. ఈ లక్ష్యం నెరవేరాలంటే ప్రజల్లో కోరికలు, ఆశలు చచ్చిపోవాలి, ప్రజలకు సంపాదన మీద, వైవాహిక సుఖాల మీద విరక్తి పెరిగేలా చేయాలి. అందుకే నరేంద్రమోడీ మొదట పెద్దనోట్లను రద్దు చేశారు. ఈ నోట్ల రద్దు తర్వాత చాలామందికి డబ్బంటే విరక్తి కలుగుతోంది. నాలుగు వేల రూపాయలు కావాలన్నా నాలుగు రోజులు ఏటిఎంల ముందు, బ్యాంకుల ముందు నిలబడే పరిస్థితి కల్పించాడు. పెద్దనోట్ల రద్దు తర్వాత తలెత్తిన పరిణామాలతో "డబ్బు ఒక మాయ... ఆస్తులు ఒక మిథ్య" అనే భావాన్ని కల్పించారు. సంసార జీవితం లేని మోడీ ప్రధానిగా ఉంటే దేశంలో ప్రజలందరు కూడా సన్యాసులుగా మారే పరిస్థితి వచ్చింది. అట్లాగే ప్రతి రాష్ట్రానికీ ఒక పెళ్లి పెటాకులు లేని సన్యాసి ముఖ్యమంత్రిగా వుంటే అతను ఆ రాష్ట్ర ప్రజలను కూడా తన మార్గంలోకి తెచ్చుకోగలడు. ప్రజలకు వైవాహిక సుఖాల మీద విరక్తి కలిగేలా పరిపాలన చేయగలడు. సుఖసంసార బాంధవ్యాల నుండి విముక్తి పొందేలా బోధనలు చేయగలడు. భగవంతుడి ధ్యానంతో పొద్దుపుచ్చేలా ప్రజల మనసులను మార్చగలడు. ప్రజలు ఆశలు, కోరికలను ఎప్పుడైతే వదులుతారో అప్పుడు ఆ సమాజంలో ఆస్తుల గొడవలుండవు, పదవుల కోసం పగలుండవు, చంపుకోవడం, నరుక్కోవడం ఉండవు. ఒకరి పట్ల ఒకరు ప్రేమతో జీవిస్తారు. అప్పుడు ఆ రాష్ట్రం సుఖసంతోషాలతో వర్ధిల్లుతుంది. అలాగే మోడీ చేస్తున్న మరో కార్యక్రమం అందరిచేత 'యోగ' చేయించడం. దీనివల్ల కోపతాపాలు తగ్గి ప్రశాంతంగా వుంటారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఋషులు, మునుల కాలంలో ప్రజలు ప్రశాంతంగా జీవించే వాళ్ళు. అలాంటి ప్రశాంత జీవనం కోసమే ఇప్పుడు నరేంద్రమోడీ సన్యాసులను, ఋషులను వెదికి వెదికి సీఎంలను చేస్తున్నారని చెప్పాడు విక్రమార్కుడు. ఆ వివరణకు సంతృప్తి చెందిన భేతాళుడు రెండు బీర్ సీసాలను ఖాళీ చేసి టక్కున మాయమయ్యాడు.

# హేమలంబ పంచాంగము



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

జ్యోతిశ్శాస్త్రము నందు లోకవ్యవహారము కొరకు మనదేశమున చంద్ర సూర్య బృహస్పతి మానములని మూడు ప్రధానముగా విభజించారు. తిరుమలగిరికి దక్షిన ప్రాంతము సౌరమానమని, తిరుమలగిరి-వింధ్య పర్వతముల మధ్య ప్రాంతమును చాంద్రమానమని, వింధ్య పర్వతములకు ఉత్తర ప్రాంతము బార్హస్పత్య మానమని ప్రచారములోనున్నది. చాంద్ర, సౌరమానముల వారికి దుర్ముఖి నామ సంవత్సరము జరుగుతుంది. బార్హస్పత్య మానము వారికి సౌమ్యానామ సంవత్సరము జరుగుతుంది.

ప్రభవాది అరవై సంవత్సరములలో 31వది హేమలంబ నామ సంవత్సరము. యుగమనగా సంవత్సరము (కాలము) యుగము యొక్క ఆది అనగా ప్రారంభము, యుగాది అయినది. వ్యవహారములో 'ఉగాది'గ పిలవబడుతున్నది. ఉగాదినాడు వారి వారి వర్ణాచారాల ప్రకారం మంగళస్నానము చేసి, దైవాన్ని చిత్తశుద్ధితో ఆరాధించి, షడ్రుచులు కల వేప ప్రసాదాన్ని స్వీకరించి పంచాంగ విషయాన్ని తెలుసుకొనవలసి వుంటుంది. పంచాంగం ఎందుకు వినటం, తెలిసికొనడం జరగాలంటే..

*'శ్రీ కల్యాణ గుణావహం రిపుహరం*
*దుస్స్వప్న దోషాపహం*
*గంగాస్నాన విశేష పుణ్యఫలదం*
*గోదాన తుల్యం నృణాం*
*ఆయుర్వృద్ధిద ముత్తమం శుభకరస్తం*
*సంతాన సంపత్ప్రదమ్*
*నానాకర్మ సుపాధనం సముచితాం*
*పంచాంగ మాకర్ణ్యతాం'..*

ప్రతి సంవత్సరము నవనాయకులని, 21 మంది ఉపనాయకులని పిలవబడుతూ గ్రహముల కాలానికి శుభాశుభ ఫలితములనిస్తాయి. చైత్ర శుక్ల పాఢ్యమి వారాధిపతి రాజు, రవి మేషరాశి ప్రవేశవారాధిపతి మంత్రి, రవి సింహరాశి ప్రవేశ వారాధిపతి సేనాధిపతి, రవి కర్కాటక సంక్రమణ ప్రవేశవారాధిపతి సస్యాధిపతి, ధనుర్మాస ప్రవేశ వారాధిపతి ధాన్యాధిపతి, మిధున సంక్రమణ ప్రవేశ వారాధిపతి అర్ఘాతిపతి, ఆర్ద్రకార్తె ప్రవేశవారాధిపతి మేఘాధిపతి, తులా ప్రవేశ సమయమ వారాధిపతి రసాధిపతి, మకర ప్రవేశవారాధిపతి నీరసాధిపతి అని నవనాయకులు, సహాయకులైన 21మంది ఉపనాయకులని పిలవబడతారు. ముందుగా ఫలితాలు చూస్తూ ఈ విధంగా వున్నాయి.

ఈ సంవత్సరమున రాజు-బుధుడు, మంత్రి-శుక్రుడు, సేన, అర్ఘమేఘాధిపతుడు-గురువు, సస్యాధిపతి-చంద్రుడు, ధాన్యాధిపతి-శని, రసాధిపతి-బుధుడు. నీరసాధిపతి-రవి. నవనాయకులలో 7 మంది శుభువలు, ఇద్దరు పాపులు, ఉపనాయకులతో 12 మంది శుభులు, 9 పాపులు, పశుపాలకుడు బలరాముడగుటచే క్షీరసమృద్ధి, తృణ సమృద్ధి కలదు.

***చాంద్రమానాబ్ద హేమలంబ సంవత్సర ఫలమ్ :***

పరిపాలకులు ప్రజలను చక్కగా పరిపాలించెదరు. ప్రభువులకు పరస్పర విరోధ భావములుండును. అచ్చటచ్చట ప్రజలకు బాధలు కలిగిననూ సుఖవంతులై యుందురు. ధాన్యాదుల ధరలు సమముగా యుండును. అల్పవర్షములు కొన్నిచోట్ల దుర్భిక్ష భయం ఉరుములు మెరుపులతో కూడిన గాలి వర్షములుండును.

హేమలంబ సంవత్సరాధిపతి రాహువు భయోత్పాతములు రోగభయములు, భూకంపాద్యుపద్రవములు, వ్యాపారమందు వడిదుడుకులుండును. చైత్ర వైశాఖ మాసములందు పీడలు, ధాన్యాది సమస్త వస్తువులకు ధరలు తగ్గును. సరిహద్దులలో యుద్ధ వాతావరణము తలపించును. జ్యేష్టాది మాస త్రయమున ధాన్యాదుల ధరలు పెరుగును. భాద్రపద ఆశ్వయుజ మాసములందు అధికవర్షములుండును. పసుపు, మిర్చి, చింతపండు, ఉప్పు, మిరియాలు, దంతములు, వెండి, బంగారము ధరలు పెరుగును. కార్తీకమాసమున కొన్నిచోట్ల పరిపాలకుల మార్పులు కలిగి ప్రజాపీడ, ఖనిజముల ధరలు సరసముగా యుండును. పశువులకు పీడ మార్గశిరం మొదలు సంవత్సరాంతము వరకు పరిపాలకులు మంచి ఆలోచనలతో జనరంజకముగా ప్రజాభీష్టములు నెరవేర్చెదరు.

**రాజాధి-నవనాయకల ఫలితములు :**

***రాజు-బుధుడు:*** బుధుడు రాజగుటచే భూమియందు గాలితో కూడిన మధ్యమ కృషి కల్గి, ప్రజలు వివాహాది శుభకార్యముల, యజ్ఞయాగాది కార్యక్రమముల పట్ల ఉత్సాహం ప్రదర్శించెదరు. మధ్యమైన ధనధాన్యవృద్ధి కలిగియున్నప్పటికినీ ప్రజలు సుభిక్షముగా నుందురు

***మంత్రి-శుక్రుడు:*** మంత్రి శుక్రుడగుటచే మంచి వర్షములు, ప్రజలు సుఖసౌఖ్యాదులను అనుభవించెదరు. ఆవులు సమృద్ధిగా పాలనిచ్చును. ధాన్య జాతులు బాగుగా ఫలించి ప్రభువులు ఉన్నతమైన సౌఖ్యములనొందెదరు.

***సేనాధిపతి-గురువు:*** గురుడు సేనాధిపతియగుటచే సువృష్టియు, ప్రజలు అత్యంత అనురాగవంతులగుట, దేవతలు ఉత్సవములను, బ్రాహ్మణులు యజ్ఞములు చేయుట, ప్రభువులు ప్రజారంజక పాలన చేయుటయు కల్గును. సైనిక పటిష్టత, ఆధునిక, యుద్ధ యంత్ర సామగ్రుల సమీకరణ బాగుండును.

***సస్యాధిపతి-చంద్రుడు:*** చంద్రుడు సస్యాధిపతి యగుటచే అధిక వృష్టి కల్గి మెట్ట పల్లప ప్రాంతమున ఆహార ధాన్యములు, పప్పు ధాన్యములు బాగుగా ఫలించును. ప్రజలు సుఖసంతోషాదులతో కూడి యుందురు.

***ధాన్యాధిపతి-శని:*** ధాన్యాధిపతి శనియగుట వలన మేఘాడంబరము కల్గి అల్పవృష్టి, ప్రజలకు వ్యాధులు వలన భయం కలిగి భయాందోళన నొందెదరు. ధాన్యాదులకు కొరత ఏర్పడును.

***మేఘాధిపతి-గురువు:*** మేఘాధిపతి గురువు యగుటచే సువృష్టియు మరియు ప్రభువులకు స్వల్ప వైరములు కల్గియున్ననూ అన్యోన్య మైత్రి కలిగి యుందురు. ధర్మబద్ధమైన విధానములో ప్రజలు నడిచెదరు.

***అర్ఘాధిపతి-గురువు:*** గురుడు అర్ఘాధిపతి యగుటచే సువృష్టియు, ధనధాన్యభివృద్ధియు, యజ్ఞకర్మలయందు బ్రాహ్మణులు శ్రద్ధ వహించుట, ప్రపంచమందు ఉత్సవములు, శుభకార్యములు అధికమగును. స్వల్పముగా ధరల పెరుగుదల వుండును.

***రసాధిపతి-బుధుడు:*** రసాధిపతి బుధుడుయగుటచే నేరేడు, బెల్లం, ఉసిరి, శిలాజిత్తు తీగలతో చుట్టబడిన వస్తువు క్రేన్ వస్తువులు మొదలగు వస్తువులకు అభివృద్ధియుండును. కుంటలు, వాగులు, సెలయేళ్ళు పొంగిపొర్లును. ధాన్యములు ఫలించును.

***నీరసాధిపతి-రవి:*** సూర్యుడు నీరసాధిపతి యగుటచే రాగి, చందనము, రత్నములు, మాణిక్యములు, ముత్యములు మొదలగు వస్తువులును వృద్ధిగా నుండును.

**వర్షలగ్నము, జగర్లగ్నములు :**

వర్షలగ్నము మేషము మరియు జగర్లగ్నము కుంభము అయినవి. వర్షలగ్నమును పరిశీలింపగా లగ్నాధిపతి అయిన కుజుడు స్వక్షేత్రమును పొంది బలీయుడగుట, గురు శుక్రులు సమసప్తక స్థితిని పొంది లగ్నాత్ షష్ట వ్యయస్థానములు పొందుట మరియు ఇతర గ్రహములు బలహీనముగా నుండెను. జగర్లగ్నమును పరిశీలింపగా లగ్నాధిపతి శని లాభ స్థానమును పొందుట, శుక్రుడు యోగకారకుడై ఉచ్ఛస్థితిని పొందియుండుట, విక్రమ స్థానమందు రవి ఉచ్ఛ స్థితి పొందుట, బృహస్పతి అష్టమస్థితిని పొందెను. గ్రహయోగములన్నింటినీ పరిశీలింపగా ఉభయ తెలుగు రాష్ట్రములు అత్యధిక విశ్వాసములతో గంభీరముగా ప్రజాపాలన సాగింతురు. స్పష్టమైన ఆధిక్యముతో ప్రత్యేక కృషి సల్పుదురు. ఆర్థిక లోటుపాట్లు వున్ననూ సంక్షేమము, సంస్కరణలకు సమ ప్రాధాన్యతనిచ్చి నడిపించెదరు. లక్ష్యసాధనకు అనేక ఒడిదుడుకులు ఎదురు కావచ్చును. మౌలిక సదుపాయముల కల్పన, భారీ నీటిపారుదల, విద్యుత్ ఉత్పత్తి, విద్యా సాంకేతీకీకరణ వంటి విషయములకు కేంద్ర ప్రభుత్వము ప్రత్యేక సహకారములందించును. ఆర్థిక లోటును పూరించుటకు కేంద్ర సహకారము తప్పనిసరి అగును. కేంద్రప్రభుత్వము అత్యంత సాహసోపేత నిర్ణయములు తీసుకొనుట ఊహించని మార్పులు తెచ్చును. ఎటువంటి నిర్ణయమునైనా గంభీరముగా, స్థిరముగా వ్యవహరించెదరు. ఇనుము, ఉక్కు, సహజ వాయువు వెలికితీత వంటి భారీ నూతన ప్రయత్నములకు అవరోధములు ఎక్కువగా నుండును. భారతదేశము తమ పొరుగు రాజ్యములతో సంఘీభావముతో మెలగుటతో అత్యున్నత గౌరవ ప్రతిష్టలు పొందును. సరిహద్దులలో యుద్ధమేఘాలు ఆవరించినప్పటికీ, ప్రతిఘటింపు మరియు దౌత్య వ్యవహారములతో శాంతి వాతావరణము నెలకొనును. విద్యా విషయములలో పెనుమార్పులు తీసుకువచ్చును. మొదటి ఆరుమాసముల తదనంతరం ఆర్థికపరిపుష్టి కలుగును. ప్రజారోగ్యము ఔషధముల లభ్యత పెరిగి సామాన్యునికి సైతము అత్యున్నత వైద్యసేవలు అందుబాటులోనికి వచ్చును. ఇంధన పొదుపు లభ్యత పెరుగుటచే ధరలు అందుబాటులో నుండుట, స్వదేశీ ద్రవ్యమారక విలువలు మునుపెన్నడూ లేనివిధంగా పెరుగుట జరుగును. రోదశీ పరిజ్ఞానము అంతరిక్ష పరిశోధనలకు ప్రాధాన్యత పెరుగును. రోడ్డు, మరియు రైలు మార్గముల విస్తరణ అభివృద్ధికి దోహదపడును. ఆంధ్రరాష్ట్ర రాజధాని నిర్మాణములో ప్రగతిపథమున నడుచును. భూమి, స్థిరాస్థి వ్యాపారములు కొంత మందకొడిన సాగును. జనులు విపరీత ధన వ్యయము, విలాసములను కొంతమేరకు తగ్గించుకొనుటకు ప్రయత్నించెదరు. అమెరికా వంటి పశ్చిమదేశాలలో అస్థిర నిర్ణయము వలన ఆ యొక్క దేశ ఆధిపత్యము, ప్రాభవము తగ్గును. కమ్యూనికేషన్స్, పర్యాటక, బస్సు, రైలు విమానయానములందు కొన్ని అపశ్రుతులు జరుగును. పంచాయతీరాజ్, మునిసిపాలిటీ, గృహ నిర్మాణ, గనులు, పౌల్ట్రీ, విద్యాసంస్థలందు ఖర్చులు పెరుగును. చలనచిత్ర, రాజకీయ క్రీడారంగములందు ప్రముఖులకు బాధలుండును. సైన్యము, పోలీసు వ్యవస్థలు సుస్థిరముగనుండును. ఆఫ్రికా, వాయవ్య ఆసియా దేశాలందు యుద్ధవాతావరణము, ప్రజా ఆస్తి సంపదల ధ్వంసకాండ జరుగును. తుఫాన్‌ల వల్ల నష్టము కలిగే అవకాశములు ఎక్కువగా నుండును. కేంద్రప్రభుత్వ నిధులపై రాష్ట్రములు ఆధారపడును. నేరచరిత పెరిగినను ప్రభుత్వ అదుపులోనుండును.

**కావేరీనదీ పుష్కరములు :**

గురువు తులారాశి ప్రవేశ సమయము నుండి 12 రోజులపాటు కావేరీనదీ పుష్కరములు జరుగుతాయి. ఈ సంవత్సరము భాద్రపద బహుళ సప్తమి మంగళవారము తేది.12.09.2017 నుండి కావేరీనదీ పుష్కరములు ప్రారంభమగును.

**కర్తరీ నిర్ణయము :**

తేది.04.05.2017 గురువారము నుండి డొల్లు కర్తరీ ప్రారంభము. తేది 11.05.2017 గురువారము నుండి తేది.28.05.2017 ఆదివారము వరకు నిజకర్తరి. ఈ కర్తరిలో 'మృచ్ఛిలా దారు కర్మాణి వర్జయేత్' అను ప్రమాణము వలన మట్టి, రాయి, కొయ్యతో కూడిన నిర్మాణములు పనికిరావు.

**మౌఢ్యములు :**

సూర్యునకు అత్యంత సమీపమును ఏ గ్రహము వచ్చినను అస్తంగత దోషము కలుగును. శుభగ్రహములగు గురు శుక్రులు రవి సమీపమునుకు వచ్చినచో అస్తంగతులగుదురు. కాబట్టి గురు శుక్ర మౌఢ్యములుగా చెప్పబడినవి. ఏ రకములైన శుభ కార్యములు కూడా చేయరాదని ధర్మశాస్త్ర, జ్యోతిశ్శాస్త్ర ప్రమాణము. తేది. 30.03.2017 వరకు శుక్రమౌఢ్యమి జరుగును. ఆశ్వీయుజ బహుళ అష్టమి శుక్రవారము తేది.13.10.2017 నుండి కార్తీక బహుళ పంచమి బుధవారము తేది. 08.11.2017 వరకు గురుమౌఢ్యమి జరుగును. మార్గశిర శుక్ల చతుర్దశి శనివారం తేది. 02.12.2017 నుండి మాఘ బహుళ అమావాస్య గురువారము తేది. 15.02.2018 వరకు శుక్ర మౌఢ్యమి జరుగును.

**మకర సంక్రమణం :**

తేది.14.01.2018 పుష్య బహుళ త్రయోదశి ఆదివారం రాత్రి 7.11 గంటలకు సూర్యుడు మకర రాశిలో ప్రవేశించును. దీనిని ఉత్తరాయణ పుణ్య కాలమని, సంక్రాంతి అని పిలుస్తారు.

***దక్షిణాయనగే భానౌ కలికాలే నరై: కృతమ్***
***పాపం మూర్తీభవత్సరం బహర్వ్యావృత్తరాయణే!!***

దక్షిణాయనంలో జనులు చేసిన పాపములన్ని ఘోరం రూపంలో మకర సంక్రమణ సమయంలో సూర్యాంశ గ్రహతారులు ప్రత్యక్షమగు రూపమే మకర సంక్రాంతి పురుష రూపము. అందుకే పితృ దేవతలను పూజిస్తారు. మకర సంక్రాంతి పురుషుల లక్షణములను పరిశీలిస్తే దేశమున సుభిక్ష క్షేమారోగ్యములుండును. జంతు నష్టములు కలుగును. జల ప్రళయములు, దొంగతనాలు, రోగభయాలు ఈ సంవత్సరము ఉండును. పంటలు బాగా పండును. కాబట్టి ఉత్తరాయణ పుణ్యకాల సమయములలో పితృదేవతలను ఆరాధించి రుణం తీర్చుకోవాలి.

**ఆర్ద్రకార్తె ప్రవేశము : (తొలకరులు)**

జ్యేష్ట బహుళ త్రయోదశి గురువారము తేది 22.06.2017న 12.46 గంటలకు కన్యా లగ్నమున ఆర్ద్రకార్తె ప్రవేశము 'పూర్వాహ్ణకాలే జగతో విపత్తి:'.. మధ్యాహ్న కాలము కావున వర్షాల వల్ల నష్టములు, ధాన్యాదుల ధరలు పెరుగుట, అకాల వర్షముల వలన పంట నష్టములు, ప్రజలకు అనారోగ్యబాధలు కలుగును.

**గ్రహణములు :**

తేది 07.08.2017 సోమవారం శ్రావణ శుక్ల పూర్ణిమ రాత్రి 10.48 నుండి 12.52 వరకు శ్రవణా నక్షత్రమున కేతుగ్రస్థ చంద్రగ్రహణము కలుగును. శ్రవణ ధనిష్ట నక్షత్రముల వారు చూడకూడదు.

తేది 31.01.2018 బుధవారం మాఘ శుక్ల పూర్ణిమ రోజున సాయంకాలము 5.15 నుంచి 8.43 వరకు ఆశ్లేషా నక్షత్రమునందు సంపూర్ణ చంద్రగ్రహణము కలదు. పుష్యమి, ఆశ్లేషా నక్షత్రముల వారు చూడకూడదు. యధోచితముగా శాంతిని నిర్వహించుకొనవలెను.

**ఆదాయ వ్యయయులు - రాజపూజ్య అవమానములు**

| | ఆ | వ్య | రా | అ |
|---|---|---|---|---|
| మేష | 5 | 5 | 3 | 1 |
| వృషభ | 14 | 11 | 6 | 1 |
| మిధున | 2 | 11 | 2 | 4 |
| కర్కాటక | 11 | 8 | 5 | 4 |
| సింహ | 14 | 2 | 1 | 7 |
| కన్య | 2 | 11 | 4 | 7 |
| తుల | 14 | 11 | 7 | 7 |
| వృశ్చిక | 5 | 5 | 3 | 3 |
| ధనుః | 8 | 11 | 6 | 3 |
| మకర | 11 | 5 | 2 | 6 |
| కుంభ | 11 | 5 | 5 | 6 |
| మీన | 8 | 11 | 1 | 2 |
| **సర్వాదాయం** | **65** | **53** | | |

ఆ - ఆదాయము వ్య - వ్యయము
రా - రాజపూజ్యత అ - అవమానములు

# మనసున్న మహిళామణులు




ఆర్థిక సాయాన్ని అందిస్తున్న వై.స్నేహలతారెడ్డి, ప్రక్కన డాక్టర్ సి.రోహిణి తదితరులు

ఆపదలో వున్న వారిని ఆదుకోవడం మానవ నైజమని ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు వై.స్నేహలతారెడ్డి అన్నారు. గూడూరు పట్టణంలోని ఆంధ్ర మహిళా మండలి ప్రాంగణంలోని ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం అనారోగ్యంగా ఉన్న సుబ్బయ్య కుటుంబానికి రూ.5,000 ఆర్థిక సాయం చేశారు. అలాగే క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్ బసవతారక క్యాన్సర్ హాస్పిటల్‌లో ఉన్న ఆర్.శ్రీనివాసులు కుటుంబానికి డాక్టర్ సి.రోహిణి రూ.10,000లను ఆర్థిక సహాయం చేశారు. మహిళా మండలి అధ్యక్షురాలు సౌందర్యమ్మ, సభ్యులు పాల్గొన్నారు.

# భక్తిమార్గాన్ని అందరూ అనుసరించాలి

**- కోట రాజశేఖర్ అవధాని**



భగవంతునిపై సంపూర్ణ విశ్వాసంతో ప్రతిఒక్కరూ భక్తి మార్గాన్ని అనుసరించాలని, ధర్మమార్గంలో పయనిస్తూ జీవితాలను కొనసాగించాలని ప్రముఖ అవధాని కోట రాజశేఖర్ అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానాలు మరియు హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 16, 17 తేదీల్లో వెంకటాచలం మండలంలోని అనికేపల్లి దళితవాడలోని శ్రీ చెన్నకేశవస్వామి దేవస్థానంలో నిర్వహించిన ధార్మిక కార్యక్రమాల్లో ఆయన పాల్గొని, భాగవతంలోని కొన్ని ముఖ్య ఘట్టాలను, అంబరీషో పాఖ్యానాన్ని వివరించారు. తదుపరి రోజు జరిగిన కార్యక్రమంలో టిటిడి ధర్మప్రచార పరిషత్ కో-ఆర్డినేటర్ మల్లెల శ్రీహరి పాల్గొని ప్రజలకు భక్తితత్వాన్ని వివరించారు. అనంతరం, ఆలయంలో జరిగిన సామూహిక కుంకుమార్చన కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ప్రముఖ హరికథా కళాకారుడు వై.దుర్గాప్రసాద్ భాగవతార్ హరికథాగానం అందరినీ ఆకట్టుకుంది.

# 9న గుర్రాల రమణమ్మ స్మారక పురస్కారాలు

దివంగత గుర్రాల రమణమ్మ స్మారకంగా ఏర్పాటుచేసిన సాహితీ పురస్కారాల ప్రదానం కార్యక్రమం ఏప్రిల్ 9వ తేది ఉదయం 9.30గంటలకు నెల్లూరులోని ఐఎంఏ హాల్‌లో నిర్వహిస్తామని ప్రముఖ కవి, జీఆర్ ట్రస్ట్ అధ్యక్షుడు గుర్రాల రమణయ్య, ట్రస్ట్ కార్యదర్శి-ప్రముఖ మానసిక వైద్యనిపుణులు జి.మురళీధర్ పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా జిల్లా జాయింట్ కలెక్టర్ ఏఎండి ఇంతియాజ్ పాల్గొనే ఈ సభకు గుర్రాల రమణయ్య అధ్యక్షత వహించి సాహితీవేత్తలకు పురస్కారాలు ప్రదానం చేస్తారన్నారు. విజయవాడకు చెందిన సాహితీవేత్త, ఎక్స్‌రే పత్రిక నిర్వాహకులు కొల్లూరి, అమలాపురానికి చెందిన రేలంగి కుమార్ శంకర్‌గౌడ్, మచిలీపట్నంకు చెందిన డాక్టర్ శేషారత్నం, ఒంగోలుకు చెందిన లెక్చరర్ ఎంవిఎస్ఎస్ శాస్త్రితో పాటు, ప్రముఖ రచయిత్రి-సాహితీ కిరణం మాసపత్రిక మేనేజర్ పొత్తూరి జయలక్ష్మి, ప్రముఖ వ్యాఖ్యాత వంగిపురపు శారదాదేవి, నెల్లూరుకు చెందిన ప్రముఖ మానసికవైద్యులు డాక్టర్ ఉదయ్ కుమార్, సింహపురి హాస్పిటల్ వైద్యనిపుణులు డాక్టర్ రాజమోహన్‌రెడ్డి, అనువాదకురాలు వై.శైలజ, బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన ప్రముఖ కవి కొర్రపాటి వెంకటరమణయ్య, రిటైర్డ్ టీచర్ గద్దెబాల సుందరంలకు ఈ పురస్కారాలను అందజేయనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తమ కుటుంబసభ్యులు జి.ప్రభాకర్-జ్యోతి, గాదిరాజు భాస్కర్-అరుణ, గురిజాల సురేష్-సుజన తదితరులు పాల్గొంటారని, సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

## కాలధర్మం

# నల్లపరెడ్డి శ్యామలమ్మ



మాజీమంత్రి స్వర్గీయ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీ జడ్పీ ఛైర్మెన్ స్వర్గీయ నల్లపరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిల సోదరుడు స్వర్గీయ నల్లపరెడ్డి సుబ్బారెడ్డి సతీమణి నల్లపరెడ్డి శ్యామలమ్మ ఈ నెల 21వ తేదీన తుదిశ్వాస విడిచారు. ఆమె వయస్సు 86 సంవత్సరాలు. ఆమెకు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆమె అల్లుడు డా॥ ఏ.ఎస్.రెడ్డి నెల్లూరు ప్రభుత్వాసుపత్రిలో సివిల్ సర్జన్‌గా పదవీ విరమణ చేశారు. చెన్నై నగరంలో పలు తెలుగు సంస్థలలో కీలకపాత్ర పోషించడమే కాకుండా, అట్టపెట్టెల తయారీ విభాగంలో అగ్రగణ్యుడిగా పిలిపించుకుంటున్న అనిల్‌కుమార్‌రెడ్డికి శ్యామలమ్మ స్వయాన మేనత్త. ఆమె మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# సహకరించిన వారికి శతకోటి వందనాలు

**బీద మస్తాన్‌రావు**



శాసనమండలి ఎన్నికల్లో స్థానిక సంస్థల కోటాలో వాకాటి నారాయణరెడ్డి విజయానికి కృషిచేసిన నాయకులకు, కార్యకర్తలకు అందరికీ కావలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, రాజధాని నిర్మాణ సలహా కమిటీ సభ్యులు బీద మస్తాన్‌రావు అభినందనలు తెలియజేశారు. మంగళవారం కావలి తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన పార్టీ నాయకులను, కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా, నారా లోకేష్ శాసనమండలి సభ్యునిగా ఎన్నికై చట్టసభలకు వెళ్తున్న సందర్భంగా ఆయన్ను అభినందిస్తూ తీర్మానం చేశారు. పార్టీలో చేరిన క్రియాశీలక సభ్యులకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. కావలి మునిసిపాలిటీలో 6వ వార్డుకు జరుగనున్న ఉప ఎన్నిక విషయమై నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. అభ్యర్థి ఎంపికను స్థానికంగా వార్డులో ముఖ్యనాయకుల కమిటీకి అప్పగించి, త్వరలో ఒక నిర్ణయానికి రావాలని సూచించారు. స్వచ్ఛభారత్-స్వచ్ఛ ఆంధ్ర ప్రాముఖ్యతను గుర్తించాలని, అన్ని ప్రాంతాలను పరిశుభ్రంగా వుంచుకోవాలని కోరారు. ఈ వేసవిలో తాగునీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అన్ని ప్రాంతాల్లో మంచినీటి సమస్య లేకుండా చూడాలన్నారు. రాష్ట్ర అభ్యున్నతికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న కార్యక్రమాలను వివరిస్తూ, అందుకు అనుగుణంగా నాయకులు, కార్యకర్తలందరూ అంకితభావంతో పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో కావలి మునిసిపల్ ఛైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాలడుగు రంగారావు, మలిశెట్టి వెంకటేశ్వర్లు, అమరా వేదగిరి గుప్తా, బీద గిరిధర్, పిన్నిబోయిన సుధాకర్, మాలేపాటి సుబ్బానాయుడు, జలదంకి శ్రీహరి, పుచ్చలపల్లి నాగేంద్రరెడ్డి, బి.శ్రీనివాసులు, గాదంశెట్టి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## కావలి కబుర్లు

## ఆంజనేయస్వామికి క్షీరాభిషేకం



కావలిలోని శ్రీ పాండురంగస్వామి దేవస్థానంలో జరుగుతున్న వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ఈ నెల 19న పాండురంగస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో కొలువైవున్న శ్రీ ఆంజనేయస్వామికి ఎంతో భక్తిశ్రద్ధలతో క్షీరాభిషేకం నిర్వహించారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డితో పాటు నాయకులు చీదెళ్ళ కిశోర్ గుప్త, వెంకటరామిరెడ్డి, రామిరెడ్డి రామమోహన్‌రెడ్డి, రంగారెడ్డి తదితరులు పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు.

# ఆడ-మగ శిశువులనే వివక్ష చూపకండి



సమాజంలో ఆడ-మగ శిశువులు అనే వివక్ష చూపకూడదని, అందరూ సమానమేనని గ్రహించాలని 'వెలుగు' పథకం ఏరియా కో-ఆర్డినేటర్ మంజుల పేర్కొన్నారు. ఈ నెల 20న కావలిలోని వెలుగు కార్యాలయం ఆవరణంలో, గర్భస్థ శిశు పరీక్షా విధానాల చట్టం (పిసిపిఎన్‌డిటి యాక్ట్-1994)పై పొదుపు మహిళలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. జాతీయ స్థాయిలో వెయ్యిమంది పురుషులుంటే 920 మంది స్త్రీలు వున్నారని గణాంకాలను వివరించారు. ఆడ శిశువుల పట్ల, బాలికల పట్ల నిర్లక్ష్యభావన విడనాడాలన్నారు. ఆడ-మగ శిశువుల మధ్య వివక్ష రూపుమాపాలన్నారు. అదేవిధంగా, వరకట్న దురాచారాన్ని నిర్మూలించాలన్నారు. పిసిపిఎన్‌డిటి డివిజనల్ కమిటీ సభ్యులు ఎం.మాల కొండారెడ్డి మాట్లాడుతూ, భ్రూణహత్యలను నిరోధించాలన్నారు. లింగనిర్ధారణ పరీక్షలు జరపడం నేరమని తెలిపారు. ప్రధానమంత్రి భేటీ బచావో-భేటీ పడావో వంటి పథకాలను ప్రతిఒక్కరూ అవగాహన చేసుకుని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం షాలెమ్ రోష్, పెద్దసంఖ్యలో పొదుపు మహిళలు పాల్గొన్నారు.

# పటిష్టంగా కమ్యూనిటీ పోలీసింగ్ వ్యవస్థ



నెల్లూరుజిల్లాలో పోలీస్ వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు త్వరలో జిల్లాలో కమ్యూనిటీ పోలీసింగ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా ఎస్పీ విశాల్‌గున్నీ పేర్కొన్నారు. ఎస్పీ కప్ క్రికెట్ పోటీల్లో భాగంగా నెల్లూరు సబ్‌డివిజన్‌కు జరిగిన పోటీల విజేతలకు బుధవారం నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో బహుమతి ప్రదానం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్ర డిజిపి సాంబశివరావు సూచనల మేరకు కమ్యూనిటీ పోలీసింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలను భాగస్వాములు చేస్తామన్నారు. ఇందులో భాగంగా అన్ని మండలాల నుంచి పోలీసు వ్యవస్థకు సహకరించే వారిని ఎంపికచేసి వారికి బాధ్యతలను అప్పగిస్తామన్నారు. వీరు నిత్యం పోలీస్ కార్యక్రమాల్లో పాలు పంచుకునేలా అవకాశం కల్పిస్తామన్నారు. దీని ద్వారా యువతలో సామాజిక బాధ్యత పెరుగుతుందని, జిల్లాలో ప్రశాంతమైన వాతావరణం నెలకొంటుందని దీనిని రూపకల్పన చేసామన్నారు. క్రికెట్‌లో మొత్తం 1500 మంది యువత పాల్గొన్నారని, వీరందరినీ కూడా కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగస్వాములు చేస్తామని తెలిపారు. త్వరలో పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో క్రికెట్ గ్రౌండ్ సిద్ధమవుతోందని, మంచి ప్రతిభ కలిగిన క్రీడాకారులను ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సహకారంతో మరింత ప్రోత్సహిస్తామన్నారు. ఈ సందర్భంగా నెల్లూరు డివిజన్ విజేతగా నిలిచిన మూడవ పట్టణ క్రికెట్ జట్టుకు, ద్వితీయ స్థానంలో నిలిచిన అయిదవ పట్టణ జట్టుకు ఎస్పీ బహుమతులు అందజేశారు. అదనపు ఎస్పీ శరత్‌బాబు, నగర డిఎస్పీ వెంకటరాముడు, మూడు, అయిదవ పట్టణ సిఐలు పాపారావు, మంగారావు, ఎస్సైలు నాగభూషణం, విజయకుమార్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# పట్టభద్రుడు గెలిచాడు!

(మొదటి పేజీ తరువాయి)

గౌరవాన్ని కాపాడారు. పట్టాభిని ఎమ్మెల్సీని చేసి మేము తలచుకుంటే మేధావులనే కాదు ఇలాంటి వాళ్ళను కూడా శాసనమండలికి పంపించగలం అని చెప్పాలనుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారాయణ ప్రయత్నాలను తిప్పికొట్టారు.

## నేరం నాది కాదంటున్న 'నారాయణ'

తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం నుండి తెలుగుదేశం అభ్యర్థి వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి పరాజయంతో ముదురుదోమల శాఖ మంత్రి పొంగూరు నారాయణ ప్రతిష్ట పాతాళానికి పడిపోయింది. చంద్రబాబు వద్ద ఆయన తలెత్తుకునే పరిస్థితి లేకుండాపోయింది. దీనికి కారణం తూర్పురాయలసీమ నియోజకవర్గ పరిధిలోని నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం జిల్లాల్లోని పార్టీ నాయకులను ఏ మాత్రం సంప్రదించకుండానే, ఒక్కరిని ఒక్క సలహా కూడా అడగకుండానే చంద్రబాబు దగ్గర తన మాటే చెల్లుబాటు కావాలనే మొండితనంతో ఏకపక్షంగా తన అనుచరుడు వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డిని అభ్యర్థిగా ప్రకటించేసుకున్నాడు. పట్టాభిని తానే గెలిపిస్తానని చంద్రబాబుకు గ్యారంటీ కూడా ఇచ్చి వచ్చాడు. పట్టాభి అభ్యర్థి కావడం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు కూడా ఇష్టం లేదు. అతని వ్యక్తిగత నైజం తెలిసిన వాళ్ళు అతనిని పూర్తిగా వ్యతిరేకించారు. అదీగాక ఎవరన్నా ప్రొఫెషనల్స్‌ను నిలబెట్టాల్సిన పదవికి అతనిని పోటీపెట్టడాన్ని కూడా అంగీకరించలేకపోయారు. అయినా ఈ మూడు జిల్లాల్లో పార్టీ నాయకులు గాని, కేడర్‌గాని పార్టీ పట్ల గౌరవంతో పట్టాభికి మద్దతుగానే పనిచేసారు. లోకల్‌గా అసెంబ్లీ ఎన్నికలను, పంచాయితీ ఎన్నికలను ఎంత ఆసక్తిగా చేస్తారో, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను కూడా అలాగే చేసారు. తెలుగుదేశంలోని ప్రతి నాయకుడు, కార్యకర్త చిత్తశుద్ధితో పని చేశారు. కాబట్టే పట్టాభికి అన్ని ఓట్లు రాగలిగాయి.

## మేధావుల ఎలక్షన్... రాంగ్ సెలక్షన్

పట్టభద్రుల ఎమ్మెల్సీ అన్నది మేధావులు, విద్యావంతుల ఎన్నిక! సమాజంలో గుర్తింపు గౌరవం వున్న వ్యక్తులను దీనికి అభ్యర్థులుగా పెట్టాలి. కాని, మంత్రి నారాయణ ఆత్మవిశ్వాసం శృతిమించి అతి విశ్వాసంగా మారింది. పార్టీలో సీనియర్లు, మేధావులు, వివిధ వృత్తులలో నిష్ణాతులు ఎంతోమంది వుండగా తన నమ్మినబంటు పట్టాభిని అభ్యర్థిగా పెట్టుకున్నాడు. పట్టాభి పట్ల పార్టీ కార్యకర్తలలోనే చాలా వ్యతిరేకత వుంది. ఇక తటస్థంగా వుండే పట్టభద్రులకు కూడా పట్టాభికి ఓటేయాలన్న ఆలోచన పోయింది. వారంతా కూడా మంచిపేరున్న యండపల్లి శ్రీనివాసులురెడ్డి వైపే మొగ్గారు. పట్టాభి మీద ఎంత వ్యతిరేకత వచ్చిందంటే... కౌంటింగ్‌రోజు ఇతను ఓడిపోవాలని చాలామంది పూజలు చేశారు. ఇతను ఎక్కడ గెలుస్తాడోనని చాలామంది టెన్షన్ పడ్డారు. అతను ఓడిపోయాడని తెలియగానే చాలామంది పండుగ చేసుకున్నారు. ఇంతకాలం ఒక అభ్యర్థి గెలుపుకోసం ఉత్కంఠతతో ఎదురుచూసిన వాళ్ళను చూసాము, కాని ఒక వ్యక్తి ఓటమి కోసం జనం ఉత్కంఠతతో ఎదురుచూడడం అన్నది పట్టాభి విషయంలోనే జరిగింది. మంత్రి నారాయణ పట్టభద్రుల అభ్యర్థి విషయంలో పారదర్శకంగా ఆలోచించి, కాంగ్రెస్‌పార్టీ నుండి వలస వచ్చిన వాళ్ళకు మాత్రమే పదవులు చెందాలన్న తన పాలసీని పక్కనపెట్టి, పార్టీ కోసం ఒళ్ళు, ఇళ్ళు గుల్లచేసుకున్న వారికి కొంచెం మంచి చేద్దామని ఆలోచించి గత రెండు ఎమ్మెల్సీ ఎన్నికలలోనూ పట్టభద్రుల నియోజకవర్గం నుండి ఓడిపోయిన సీనియర్ న్యాయవాది దేశాయిశెట్టి హనుమంతురావును అభ్యర్థిగా పెట్టివుంటే ఈరోజు పట్టభద్రుల నియోజకవర్గంలో ఫలితం ఇంకో విధంగా వుండేది. పార్టీ కేడర్ మద్దతుతో పాటు సానుభూతి ఓట్లతోనైనా గెలిచి ఉండేవాడు. అభ్యర్థి ఎంపిక విషయంలో నారాయణ తప్పు నిర్ణయమే ఈరోజు ఓటమికి ప్రధానకారణం.

## ఇతరులపైకి నింద

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఓటమితో పాటు స్థానిక ఎమ్మెల్సీలో పార్టీ అభ్యర్థి వాకాటికి మెజార్టీ తగ్గడానికి కారకుడు కూడా నారాయణ. ఈ ఇద్దరు అభ్యర్థుల ఎంపికే రాంగ్! వీళ్ళిద్దరూ కాంగ్రెస్ నుండి వచ్చినవాళ్లే! అది కూడా పార్టీ అధికారంలోకి వచ్చాక! వాకాటి కంటే ఆదాల ప్రభాకర్‌రెడ్డి స్థానిక ఎమ్మెల్సీ అభ్యర్థి అయ్యుంటే కనీసం 150ఓట్లకు తగ్గకుండా మెజార్టీ వచ్చేది. కాని, మంత్రి పట్టుబట్టి వాకాటికి సీటిప్పించాడు. పార్టీలో అతని మీదున్న వ్యతిరేకత వల్ల మెజార్టీ బాగా తగ్గింది. ఇక మంత్రి గారి పట్టాభి సెలక్షన్ కూడా పక్కా రాంగ్! తప్పు తన వద్ద పెట్టుకుని మంత్రి ఈ పాపాన్ని పార్టీలోని ఇతర నాయకుల మీదకు నెట్టాలని చూస్తున్నాడు. ఈ రెండుచోట్ల పార్టీ అభ్యర్థులకు సహకరించలేదంటూ కొందరు నాయకులపై తప్పుడు ఆరోపణలతో చంద్రబాబుకు నివేదిక ఇచ్చినట్లు తెలుస్తోంది.

చంద్రబాబు కూడా గ్రౌండ్‌లెవల్లో వాస్తవాలను వదిలేసి, జిల్లాలో పార్టీ కార్యకర్తలను, వారి సమస్యలను ఏనాడూ పట్టించుకోని నారాయణ చెప్పుడు మాటలకు చెవి అప్పగిస్తే జిల్లాలో పార్టీ పరిస్థితి ఇంకా దారుణంగా మారుతుంది.

# ఆర్యవైశ్యులు అగ్రగాములుగా రాణించాలి

ప్రతి రంగంలో ఆర్యవైశ్యులు అగ్రగాములుగా రాణించాలని భారత సైన్సు కాంగ్రెస్ అధ్యక్షుడు, ఎన్ఆర్ఎం యూనివర్శిటీ అమరావతి ప్రో వైస్‌ఛాన్సలర్ డాక్టర్ డి.నారాయణరావు అన్నారు. నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట పప్పులవీధిలోని పాండురంగ అన్నదాన సమాజంలో జరిగిన ఆవోపా అఫిషియల్స్, ప్రొఫెషనల్స్ మీట్‌లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, అందులో ఆర్యవైశ్యులు భాగస్వాములు కావాలన్నారు. విశిష్ట అతిథులుగా నెల్లూరు ప్రభుత్వ వైద్యకళాశాల ప్రొఫెసర్ డాక్టర్ జి.చంద్రశేఖర్, ఏపిజెన్‌కో చీఫ్ ఇంజనీర్ ఎస్.బాలాజీ, ఆలిండియా ఆవోపా ఫెడరేషన్ కార్యదర్శి జి.సత్యనారాయణలు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది బి.లీలామోహన్‌ను సత్కరించారు. ఆవోపా అధ్యక్షులు రామచంద్రరావు, కార్యదర్శి ప్రసాద్, కోశాధికారి హనుమంతరావుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.



# బాబుకు ప్రమాద సంకేతాలు!

(మొదటి పేజీ తరువాయి)

నిజంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆత్మసాక్షిని ప్రశ్నించుకోమనండి... ప్రజాస్వామ్యానికి పాతరేసి, ప్రలోభాలకు తెరతీసి, డబ్బులు, నోట్ల కట్టలతో అవతల పార్టీ ఓటర్లకు ఎరవేసి... కడప, కర్నూలు, నెల్లూరుజిల్లా స్థానిక సంస్థల ఎన్నికల్లో తాము గెలిచింది కూడా ఒక గెలుపేనని చంద్రబాబు ఆత్మసాక్షి ఒప్పుకోగలదా? ఈ మూడు స్థానిక సంస్థల ఎమ్మెల్సీలలో గెలిచామని, వై.యస్. కంచుకోట కడపలో తెలుగుదేశం జెండా ఎగురవేసామని వీళ్ళు బీరాలు పలకొచ్చుగాక... పచ్చ మీడియా ఇది అద్భుత విజయమంటూ బాకా ఊదొచ్చుగాక... కాని నిజంగా వాళ్లకు మనస్సాక్షి వుంటే, నిజాన్ని నిర్భయంగా అంగీకరించే ధైర్యముంటే ఈ మూడు జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం గెలిచినా నైతికంగా ఓడినట్లే కదా!

ఈ మూడుజిల్లాల స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచిన దానివల్ల రాజకీయంగా ఎంత ప్రయోజనముందో తెలియదుగాని, ఈ మూడుజిల్లాల ఎన్నికల్లో గెలవడానికి తెలుగుదేశంపార్టీ తొక్కిన అడ్డదారులు మాత్రం తన రాజకీయ జీవితంలోనే చంద్రబాబుకు మాయని మచ్చగా మిగిలిపోతాయి. ఎందుకంటే ఇంతగా దిగజారి ఎన్నికలను దేశ చరిత్రలోనే ఎవరూ చేసి వుండరు. మూడు ఎమ్మెల్సీ పదవుల కోసం ఇన్నేసి కోట్లు ఎవరూ ఖర్చుపెట్టి వుండరు. నూటికి నూరు శాతం అధికార దుర్వినియోగానికి పాల్పడినా ఈ మూడు జిల్లాల్లోనూ పెద్ద మెజార్టీలతో గెలిచారా అంటే అదీ లేదు. నిక్కీ నీల్గి, ముక్కి మూలిగి స్వల్ప తేడాలతోనే బయటపడ్డారు.

సొంత జిల్లా కడపలో ఓటమి తప్పితే ఈ ఎన్నికల్లో వైకాపాకు కొత్తగా పోయిందేమీ లేదు. నెల్లూరు, కర్నూలుజిల్లాల్లో 2014 ఎన్నికలప్పుడు వైకాపా నుండే మెజార్టీ సభ్యులు గెలిచినా, ఆ తర్వాత ఎక్కువ మంది అధికార తెలుగుదేశంలో చేరారు. కేవలం పోటీ చేయాలనే పంతంతోనే జగన్ ఈ రెండు జిల్లాల్లో అభ్యర్థులను నిలబెట్టాడు తప్పితే గెలుపుపై పెద్దగా అంచనాలు లేవు. అసలు కర్నూలుజిల్లాలో పోటీ చేయాలన్న ఉద్దేశ్యం జగన్‌కు లేకున్నా గౌరు వెంకటరెడ్డే ముందుకొచ్చి పోటీ చేసాడు. దాదాపు 200 ఓట్ల తేడాతో గెలుస్తుందనుకున్న కర్నూలు జిల్లాలో తెలుగుదేశంకు ముచ్చెమటలు పట్టించాడు. కేవలం 57ఓట్ల తేడాతో ఇక్కడ వైకాపా ఓడిపోయింది. నెల్లూరుజిల్లాలో కూడా జంపింగ్ జిలానీల మూలంగా తెలుగుదేశంకే 150ఓట్ల ఆధిక్యత ఉండింది. కాని వైకాపా అభ్యర్థి గట్టి పోటీనిచ్చి తెలుగుదేశం మెజార్టీని 87 ఓట్లకు తగ్గించ గలిగాడు. ఇక కడపలో తెలుగుదేశం అరాచకాలకు తెరతీసింది. ఒక్కో ఓటరుకు 15 నుండి 30లక్షల దాకా ముట్టజెప్పినట్లు సమాచారం. ఇంతింత డబ్బులిస్తే స్థానిక ఓటర్లు మాత్రం వైకాపాలో ఎంతకాలమని నిలుస్తారు? కడపలో వైకాపాకు 200ఓట్ల ఆధిక్యతవున్నా అధికార పార్టీ ప్రలోభాల దెబ్బకు ప్రతిపక్షం తట్టుకోలేకపోయింది. కడప నుండి ప్రత్యేక విమానాలలో ఓటర్లను క్యాంప్‌కు తరలించారు. ఇంతచేసి ఇక్కడా 38ఓట్లతో గెలిచారు. ఈ మూడు జిల్లాల్లో మేము గెలిచామని చంద్రబాబు అనుకుంటే అంతకంటే సిగ్గుచేటు విషయం ఇంకొకటి ఉండదు. ఎందుకంటే సంతలో పశువుల్లా మారిన కొందరు నాయకులను కొనుక్కుని గెలవడం ఓ గెలుపు కాదు.

అసలైన గెలుపంటే ఏంటో ఆ పక్క రోజే ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఫలితాల్లో తేటతెల్లమైంది. మూడు స్థానిక ఎమ్మెల్సీల గెలుపు ఆనందాన్ని 24గంటల లోపే తుడిచిపెడుతూ చంద్రబాబుకు దిమ్మ తిరిగేలా పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఫలితాలు వెలువడ్డాయి.

రెండు ఉపాధ్యాయ, మూడు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో అధికార తెలుగుదేశం బొక్కబోర్లా పడింది. కేవలం ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో మాత్రమే బీజేపీ అభ్యర్థి రాం మాధవ్ విజయం సాధించారు. తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ నియోజకవర్గంలో వైకాపా బలపరచిన పిడిఎఫ్ అభ్యర్థి విఠపు బాలసుబ్రహ్మణ్యం, తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గంలో వైకాపా బలపరచిన పిడిఎఫ్ అభ్యర్థి యండపల్లి శ్రీనివాసులురెడ్డిలు గెలుపొందారు. అలాగే పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ నియోజకవర్గం నుండి వైకాపా బలపరచిన పిడిఎఫ్ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి గెలుపొందగా పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం నుండి వైకాపా ఏకైక అభ్యర్థి వెన్నపూస గోపాలరెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించారు.

మొత్తం ఐదు స్థానాల ఎన్నికల్లో నాలుగు చోట్ల వైకాపా, ఆ పార్టీ బలపరచిన అభ్యర్థులు గెలుపొందారు. ఈ ఫలితాలను బట్టే ఏ పార్టీ పరపతి ఏంటో అర్థమవుతోంది. డబ్బులకు అమ్ముడుపోయే వందల సంఖ్యలో ఓటర్లున్న స్థానిక సంస్థల ఎమ్మెల్సీలలో మాత్రమే తెలుగుదేశం ప్రలోభాలు పనిచేసాయి. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, నిరుద్యోగులు ఓటర్లుగా వున్న నియోజకవర్గాలలో తెలుగుదేశం తిరస్కరణకు గురైంది. రాష్ట్రంలో ఉండేది 13జిల్లాలే! 9జిల్లాల్లో పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగాయి. లక్షలాదిమంది మేధావులు, ఉద్యోగులు ఓట్లు వేస్తేనే తెలుగుదేశం పరిస్థితి ఇలా తెల్లారింది. రేపు ప్రత్యేక హోదా లేక దగాపడ్డ యువతీ యువకులు, ఋణమాఫీ అమలుకు నోచుకోని రైతన్నలు, బూటకపు వాగ్దానాలకు మోసపోయిన డ్వాక్రా మహిళలు, ఏ సంక్షేమానికీ నోచుకోని మైనార్టీలు, అభివృద్ధికి ఆమడ దూరంలో వున్న బడుగుబలహీనవర్గాల ప్రజలు ఓటింగ్‌లో పాల్గొంటే పరిస్థితి ఇక ఎలా ఉంటుందో?

# మళ్ళీ ఆ ముగ్గురే!

(మొదటి పేజీ తరువాయి)

పిడిఎఫ్ అభ్యర్థి యండపల్లి శ్రీనివాసులురెడ్డి తెలుగుదేశం అభ్యర్థి వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డిపై 3,232 ఓట్ల తేడాతో నెగ్గడం జరిగింది. ఈ ముగ్గురిలోనూ విఠపు బాలసుబ్రహ్మణ్యంది హ్యాట్రిక్ విజయం కాగా, యండపల్లి శ్రీనివాసులురెడ్డి, వాకాటి నారాయణరెడ్డిలు ఎమ్మెల్సీ పోటీలో వరుసగా రెండోసారి గెలిచి మండలికి వెళుతుండడం విశేషం.

ఈ మూడింటిలోనూ ఉపాధ్యాయుల నియోజకవర్గం గురించి పెద్దగా చెప్పుకోనవసరం లేదు. ఉపాధ్యాయ సంఘాలలో యూటిఎఫ్ బలమైంది కాబట్టి ఆ యూనియన్ బలపరచిన అభ్యర్థి గెలవడం సాధారణ విషయమే. ఇక స్థానిక సంస్థల ఎమ్మెల్సీ విషయానికొస్తే గెలుపు కోసం అధికారపార్టీ ఎన్ని అడ్డదారులు తొక్కాలో అన్నీ తొక్కింది. సొంతపార్టీ వాళ్ళకు రెండు లక్షలు, అవతల నుండి వచ్చిన వాళ్ళకు 5లక్షలు లెక్కన ఇచ్చినట్లు తెలుస్తోంది. ఓటర్లకు డబ్బులిచ్చే విషయంలో వైకాపా వాళ్ళు అధికారపార్టీతో పోటీపడలేకపోయారు. అదీగాక వైకాపా వైపు సమిష్టి నాయకత్వం, ఉమ్మడి వ్యూహం కొరవడింది. ఎవరి ఓట్లు వారే దాచిపెట్టుకోవాలన్నట్లు నాయకులు వ్యవహరించారు. ముఖ్యంగా జిల్లా పార్టీకి పెద్దగా వ్యవహరిస్తున్న మేకపాటి రాజమోహన్‌రెడ్డి నాయకత్వం వల్ల పార్టీకి పెద్దగా ఉపయోగం ఉండడం లేదన్నది మరోసారి బహిర్గతమైంది. వైకాపాలోని లోపాలే తెలుగుదేశంకు బలమయ్యాయి. అదీగాక స్థానిక ఎమ్మెల్సీ ఎన్నికను చంద్రబాబు, లోకేష్ బాబులతో పాటు మంత్రులు పి.నారాయణ, శిద్ధా రాఘవరావులు దగ్గరుండి పర్యవేక్షించారు. క్యాంపులకు కాపలా కాసారు. ఇన్ని చేస్తే తెలుగుదేశం అభ్యర్థి వాకాటి నారాయణరెడ్డి 87ఓట్ల తేడాతో గెలవగలిగాడు. ఇక పట్టభద్రుల నియోజకవర్గంలో తెలుగుదేశం అభ్యర్థి వేమిరెడ్డి పట్టాభిరామి రెడ్డి ఓటమితో ఆ పార్టీలోనే అంతర్మథనం మొదలైంది. చంద్రబాబు ఈ నియోజకవర్గాన్ని ఎంతో సీరియస్‌గా తీసుకున్నాడు. మంత్రి తన అనుచరుడు వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డిని అభ్యర్థిగా పెట్టుకున్నాడు. పట్టాభిని తాను గెలిపిస్తానని చంద్రబాబు వద్ద కోతలు కోసి వచ్చాడు. పట్టభద్రుల ఎన్నికలలో గెలవడం కోసం ఎన్ని నికృష్టపు పనులు చేయాలో అన్నీ చేశాడు. వేల సంఖ్యలో దొంగ ఓట్లను చేర్చారు. దొంగ సర్టిఫికెట్లను సృష్టించారు. ఎన్నికల రోజు భారీగానే దొంగఓట్లు వేయించారు. ఇన్ని చేసినా కూడా అధర్మానికి అపజయం తప్పలేదు. నీతికి, నిజాయితీకి మారుపేరైన పిడిఎఫ్ అభ్యర్థి యండపల్లి శ్రీనివాసులురెడ్డి వరుసగా రెండోసారి విజయం సాధించాడు. మొత్తానికి గెలిచిన ముగ్గురు కూడా శాసనమండలికి పాతోళ్ళే కావడం విశేషం.

# ఓటమికి దండన... గెలుపుకు అభినందన

## జిల్లా 'దేశం' నేతలతో బాబు సమీక్ష

అమరావతి రాజధాని ఉండవల్లిలోని తన అధికారిక నివాసంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 23వ తేదీ నెల్లూరు జిల్లా తెలుగుదేశం నాయకులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా నుండి మంత్రి పి.నారాయణ, ఇన్‌ఛార్జ్‌మంత్రి శిద్ధా రాఘవరావు, పార్టీ జిల్లా పరిశీలకులు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఎమ్మెల్సీలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వాకాటి నారాయణరెడ్డి, ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, బొల్లినేని రామారావు, కురుగొండ్ల రామకృష్ణ, పాశం సునీల్ కుమార్, నెల్లూరు మేయర్ అబ్దుల్ అజీజ్, మాజీ మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, పరసారత్నం, మాజీ ఎమ్మెల్యేలు బీద మస్తాన్‌రావు, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డిలు హాజరయ్యారు. కష్టపడి స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వాకాటి నారాయణరెడ్డిని గెలిపించారని అభినందిస్తూనే మెజార్టీ తగ్గడంపై చంద్రబాబు అసహనం వ్యక్తం చేసాడని తెలుస్తోంది. స్థానిక ఎమ్మెల్సీకి సంబంధించి క్యాంప్‌లో 520మంది ఓటర్లున్నా క్రాస్ ఓటింగ్‌ను ఆపలేకపోయారని, 150 ఓట్ల మెజార్టీ రావాల్సిన చోట 87ఓట్లతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చిందంటూ అసహనం వ్యక్తం చేశారు. నేను, లోకేష్‌బాబు టైంకు అప్రమత్తం కాబట్టి సరిపోయిందిగాని, మేం పట్టించుకోకుండా నెల్లూరు స్థానిక ఎమ్మెల్సీని వదిలేసి వుంటే అసలు గెలిచేవాళ్ళమా అని ప్రశ్నించారు.

ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాల రెండింటిలో ఓడిపోవడంపై బాబు బాగా బాధపడ్డాడంట! ఉపాధ్యాయ నియోజకవర్గంలోనూ, పట్టభద్రుల నియోజకవర్గంలోనూ భారీగా ఓట్లను ఎన్‌రోల్ చేయించాం. వాటిని సక్రమంగా పోలింగ్ చేయించు కోలేకపోయాం. పట్టభద్రుల నియోజకవర్గంలో 14,400 ఓట్లు చెల్లనివైతే అందులో 12వేల ఓట్లు మనవాళ్ళు వేసినవే వున్నాయి. కనీసం ఓటర్ల చేత సక్రమంగా ఓటు వేయించుకోలేకపోయామని, ఇలా వుంటే 2019 ఎన్నికలకు ఏ విధంగా పోగలమని చంద్రబాబు ప్రశ్నించారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీల ఓటమిపై జిల్లా నేతలు కూడా తగిన విధంగానే సమాధానమిచ్చారని తెలుస్తోంది. పట్టభద్రుల అభ్యర్థి ఎంపికే రాంగ్‌గా జరిగిందన్నట్లు చెప్పారు. మాకెవరికీ చెప్పకుండా అభ్యర్థిని ప్రకటించినా, అందరం కష్టపడ్డాం కాబట్టే పార్టీ అభ్యర్థికి 60వేలకు పైగా ఓట్లు వచ్చాయని చెప్పారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీని చివరి నిముషంలో ప్రకటించినా అందరం సమిష్టిగా పని చేసాం కాబట్టే ఉపాధ్యాయ యూనియన్‌లలో బలమైన యూటిఎఫ్‌కు గట్టి పోటీ ఇవ్వగలిగామన్నారు. ఈ వాదనతో చంద్ర బాబు కూడా ఏకీభవించక తప్పలేదు.

మీ జిల్లా పార్టీలో ఇంకా లోపాలున్నాయి, వాటిని గుర్తించండి, కేడర్‌ను సమన్వయపరచండి, కార్యకర్తలతో మాట్లాడండి, నెలకు రెండుసార్లు కార్యకర్తలతో సమావేశాలు, బహిరంగ సభలు పెట్టండి. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకుపోండి, ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను సమర్ధవంతంగా తిప్పికొట్టండంటూ చంద్రబాబు జిల్లా నేతలకు బోధించారు. ఇటీవల జిల్లా వైకాపా ఎమ్మెల్సీ కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేస్తున్న ఆరోపణలను సమర్ధవంతంగా తిప్పికొట్టి, అతను తవ్విన గోతిలో అతనే పడేలా చేసారంటూ సోమిరెడ్డిని అభినందించారు.



ఉండవల్లిలోని సిఎం అధికార నివాసంలో చంద్రబాబునాయుడును సత్కరిస్తున్న నెల్లూరుజిల్లా తెలుగుదేశంపార్టీ నాయకులు

### కోడ్ ముగిసింది...

## కుర్చీలు నిండాల్సి వుంది!

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ మూలంగా దాదాపు నెల నుండి జిల్లాలో ఎటువంటి అధికారిక నియామకాలు, బదిలీలు జరగలేదు. 22వ తేదీతో ఎన్నికల కోడ్ ముగిసింది. ఇక అధికారుల బదిలీల ప్రక్రియ చేపట్టవచ్చు. ముందుగా భర్తీ చేయాల్సింది నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ పోస్టును. కమిషనర్‌గా వున్న వెంకటేశ్వర్లును గతేడాది డిసెంబర్‌లో బదిలీ చేశారు. విజయవాడ సిసిఎల్‌ఏలో పనిచేస్తున్న హరీష్‌ను కొత్త కమిషనర్‌గా వేసినా ఆయన ఇక్కడకు రావడానికి భయపడ్డారు. బాధ్యతలు తీసుకోవడానికి వెనుకాడాడు. దీంతో అతను ఇక్కడకు రాడని తేటతెల్లమైంది. ఈలోపు ఎన్నికల కోడ్ రావడంతో దాదాపు మూడున్నర నెలల నుండి కమిషనర్ పోస్ట్‌లో ఇన్‌ఛార్జ్‌లు నడుస్తున్నారు. అలాగే జడ్పీ సిఇఓగా వున్న బి.రామిరెడ్డిపై ఏసిబి దాడి జరిగి ఆయన అరెస్ట్ కావడంతో ఆ పోస్ట్‌లో కూడా ఇన్‌ఛార్జే వున్నారు. అలాగే జిల్లా పంచాయితీ అధికారిగా కూడా ఇన్‌ఛార్జ్ వున్నారు. జిల్లా అటవీశాఖ అధికారిగా కూడా ఇన్‌ఛార్జ్ అధికారి చంద్రశేఖర్ కొనసాగుతున్నారు. జిల్లా పరిశ్రమల శాఖ జోనల్ మేనేజర్‌గాను, కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు సిఇఓగాను ఇన్‌ఛార్జ్‌లే ఉండడం విశేషం. సోమశిల ప్రాజెక్ట్ ఎస్.ఇగా 4నెలల నుండి ఇన్‌ఛార్జ్ వున్నారు. ఇక పిడబ్ల్యూడి ఎస్‌ఇగా వున్న కోటేశ్వరరావు ఈ నెలాఖరులో పదవీ విరమణ చేయనున్నారు. ఇరిగేషన్ ఇన్‌ఛార్జ్ ఎస్‌ఇగా కూడా ఆయనే పనిచేస్తున్నారు. ఆయన రిటైర్ అయితే ఈ రెండుశాఖలకు ఎస్‌ఇలను నియమించాల్సి వుంటుంది. పూర్తి స్థాయి అధికారులు లేక ఆయాశాఖల్లో పనితీరు గాడి తప్పుతోంది. అధికారులను నియమించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాల్సివుంది.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com